



# విజయభాను

44th వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, బుధవారం 02-12-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 44 సంచిక : 71 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించం

### సభ్యుల మాటలు వినకుండా టీడీపీ గందరగోళం సృష్టిస్తోంది

### వచ్చే ఎన్నికల్లో టీడీపీకి రెండు, మూడు స్థానాలు కూడా రావు

### ప్రతిపక్ష టీడీపీపై సీఎం జగన్ ఫైర్



అమరావతి : రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రతిపక్ష టీడీపీ సభ్యుల తీరుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడుతో పాటు విపక్ష సభ్యులు పదేపదే సభకు అంతరాయం కలిగించడం పట్ల అసంతృప్తి చెందారు. ప్రజా సమస్యలపై కనీస అవగహన లేని విధంగా ప్రతిపక్షం వ్యవహరిస్తోందని సభలో మండిపడ్డారు. కనీస అంశాలపై చర్చించకుండా అసలు అసెంబ్లీకి ఎందుకు వస్తున్నారో కూడా అర్థంకావడంలేదని అన్నారు. ఓవైపు సీఎం ప్రసంగం సాగుతున్నా.. అదిప్రజలకు చేరవద్దనే కుట్రతో సభలో గందరగోళం సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో సీఎం ప్రసంగాన్ని అడ్డుకోవడం దారుణమన్నారు. అనవసరమైన అంశాలపై రాద్ధాంతం చేస్తున్నారని సీఎం జగన్ విమర్శించారు.

అసెంబ్లీ శీతకాల సమావేశాల్లో భాగంగా రెండోరోజు సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రసంగించారు. 'సభ్యుల మాటలు వినకుండా టీడీపీ గందరగోళం సృష్టిస్తోంది. డిసెంబర్ 15న రూ.1227 కోట్ల బీమా చెల్లిస్తున్నాం. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లోనే బీమా చెల్లింపులను చర్చించాం.

కేబినెట్‌లోనూ ఆమోదించాం. డిసెంబర్ 25న ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నాం. జగన్ ఒక మాట చెబితే.. ఆ మాట నిలబెట్టుకుంటాడని ప్రజల్లో విశ్వాసం ఉంది. చంద్రబాబుకు మోసం చేయడమే తెలుసు. టిడ్కోపై చర్చ జరగకూడదనే చంద్రబాబు గందరగోళం సృష్టిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి రెండు, మూడు స్థానాలు కూడా రావు. తాను ప్రజలకు

తరువాయి 2లో..





## ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు సాధ్యం కాదు

### హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ఏపీ ప్రభుత్వం




అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికలు నిర్వహించొద్దని హైకోర్టులో ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహణ సాధ్యం కాదంటూ పిటిషన్‌లో పేర్కొంది. ఎస్ఈసీ నిర్ణయం సుప్రీంకోర్టు ఆదే శాలకు విరుద్ధంగా ఉందని ప్రభుత్వం తెలిపింది. పిటిషన్‌లో ప్రతివాదిగా ఎన్నికల కమిషన్ కార్యదర్శిని ప్రభుత్వం చేర్చింది. కరోనా సమయంలో ప్రజారోగ్యం ప్రభుత్వ కర్తవ్యమని ఏపీ ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో ఇప్పటికే కరోనాతో 6వేల మంది మరణించారని, ఎన్నికల ప్రక్రియను వెంటనే నిలిపివేసేలా ఆదేశాలివ్వాలని హైకోర్టును ప్రభుత్వం కోరింది. గతంలో కరోనా అంటూ ఎన్నికలు వాయిదా వేసి.. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తామనడంపై పిటిషన్‌లో ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది.

## రైతులు విత్తనాలు పొందాలంటే గ్రామ సచివాలయంలో సంప్రదించవచ్చు

### వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు



అమరావతి : నివర్ తుఫాన్ పంట నష్టం, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై శాసనమండలిలో మంగళ వారం చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు పలు అంశాలపై మాట్లా డారు. ' రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం. విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. రైతులు విత్తనాలు పొందాలంటే గ్రామ సచివాలయంలో సంప్రదించవచ్చు. ఏ సీజన్‌లో పంట నష్టానికి సంబంధించిన ఇన్ పుట్ సబ్సిడీ అదే సీజన్‌లో ఇవ్వటం ఇకపై చరిత్రగా నిలిచిపోనుంది. రైతులను ఆదుకునే విషయంలో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా ఉంది. రైతుల సంక్షేమం కోసం మా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. సహకార సంఘాన్ని కూడా ఆధునికరిస్తాం. గత ప్రభుత్వం సహకార రంగాన్ని నిర్వీర్యం చేసింది. హెరిటేజ్ డెయిరీ ఏ రోజైతే ప్రారంభమైందో ఆ రోజు నుంచి సహకార రంగం కుప్పకూలింది. హెరిటేజ్ డెయిరీ కోసమే చిత్తూరు డెయిరీని చంపేశారు. డెయిరీలను మాక్స్ యాక్ట్ నుంచి కంపెనీ యాక్ట్ ఎందుకు తీసుకువచ్చారనే దానిపై లోకేష్ సమాధానం చెప్పాల్సిన అవసరం

తరువాయి 2లో..

## నిరసన తర్వాతే ప్రభుత్వం స్పందించింది

### తెదేపా శాసనసభాపక్ష ఉపనేత అచ్చెన్నాయుడు



అమరావతి: తెలుగుదేశం అధినేత చంద్రబాబు పోడియం వద్ద బైఠాయించి నిరసన తెలిపాకే పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెదేపా శాసనసభాపక్ష ఉపనేత అచ్చెన్నాయుడు అన్నారు. అసెంబ్లీ వద్ద మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పంటల బీమా కట్టలేదని ప్రభుత్వాన్ని తాము నిలదీస్తే కట్టామంటూ సభలో ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి అసత్యాలు చెప్పారని దుయ్యబట్టారు. ఇప్పుడు బీమా ప్రీమియం చెల్లింపులకు నిధులు విడుదల చేస్తే లాభం ఏమిటని ప్రశ్నించారు.

పంట నష్టపోయాక, రైతులు చనిపోయాక పరిహారం చెల్లిస్తే లాభమేమిటని ప్రభుత్వాన్ని అచ్చెన్నాయుడు నిలదీశారు. ప్రభుత్వం ఏవిధంగా రైతుల్ని మోసం చేసిందో ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. చంద్రబాబుని ఉద్దేశించి వైకాపా మంత్రులు ఏకవచనంతో మాట్లాడటం సబబేనా అని మండిపడ్డారు. ఈ తరహా అవాకులు చవాకులు మానుకోకుంటే జగన్‌ను ఉద్దేశించి ప్రతి తెదేపా కార్యకర్త గట్టిగా స్పందించాల్సి వస్తుందని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

## ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్‌న్యూస్

అమరావతి : కోవిడ్ కారణంగా 2020 మార్చి నెలలో వాయిదా వేసిన వేతనాలు, గౌరవ వేతనాలు, పెన్షన్లను డిసెంబర్ నెలలో చెల్లించేందుకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మార్చి, ఏప్రిల్ నెలల బకాయిలను చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.ఎస్ రావత్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు ఏప్రిల్ నెలలో తగ్గించిన వేతనాలను డిసెంబర్, 2021 జనవరిలో చెల్లించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

## ముంచుకొస్తున్న 'బురేవి' ముప్పు

### 36 గంటల్లో విస్తారంగా వర్షాలు

### చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు



మహారాణిపేట : ఆగ్నేయ బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఉన్న తీవ్ర అల్పపీడనం బలపడుతోంది. గడిచిన 3 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణించి ట్రింకోమలై

తరువాయి 2లో..

## మార్చి నాటికి మార్కెట్‌లోకి కొవిషీల్డ్ వ్యాక్సిన్

న్యూఢిల్లీ : వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్ నాటికి కొవిషీల్డ్ వ్యాక్సిన్‌ను భారత మార్కెట్‌లో అందుబాటులో ఉంటుందని పూణేకు చెందిన సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఐ) తెలిపింది. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం టీకాను ఇండియాలో సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఐ) 'కొవిషీల్డ్' పేరుతో అభివృద్ధి చేసి, పరీక్షిస్తోంది. ప్రస్తుతం సంస్థ 1600 మంది వలంటీర్లపై రెండు, మూడో విడత ట్రయల్స్ నిర్వహిస్తోంది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ వ్యాక్సిన్ టూర్‌లో భాగంగా సీరం ఇనిస్టిట్యూట్‌ను

తరువాయి 2లో..

## బ్రహ్మోస్ క్షిపణిని పరీక్షించిన నేవీ



న్యూఢిల్లీ : బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్‌కు చెందిన యాంటీ షిప్ వర్షన్‌ను ఇవాళ భారత్ పరీక్షించింది. అండమాన్ నికోబార్ దీవుల్లో ఈ క్షిపణి పరీక్ష జరిగినట్లు అధికారులు చెప్పారు. భారత్ ఇటీవల వరుసగా బ్రహ్మోస్ క్షిపణిని పరీక్షిస్తున్న విషయం తెలిసిందే. దానిలో భాగంగానే ఇవాళ కూడా ఈ ట్రయల్ జరిగింది. గత నెల 24వ తేదీన కూడా భారత్ .. బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైల్‌ను ఇవాళ భారత్ విజయవంతంగా పరీక్షించింది. అండమాన్ నికోబార్ దీవుల్లోనే ఆ పరీక్ష కూడా జరిగింది. మరో దీవిలో ఉన్న టార్గెట్‌ను

తరువాయి 2లో..




## స్మార్ట్ సిటీ పనులు కమిషనర్ ఆకస్మిక తనిఖీ



విశాఖపట్నం : జివిఎంసి కమిషనర్ డా. జి. సృజన స్మార్ట్ సిటీ పథకం క్రింద నగరంలో జరుగుచున్న పలు అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఎం.వి.పి. కోలనీలోగల ఏ.ఎస్. రాజా గ్రౌండ్ నందు నిర్మాణ దశలో వున్న ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించారు. పనులు మందకొడిగా కొనసాగుతున్నాయని తన అసంతృప్తిని వ్యక్తం చేసారు. పూర్తిగా పనులపై శ్రద్ధ వహించి త్వరితగతిన స్టేడియం పనులు పూర్తి చేయాలని లేక పోతే తగుచర్యలు గైకొంటామని సంబందిత కాంట్రాక్టరును హెచ్చరించారు. మరో పది రోజులలో వచ్చి తనిఖీ చేస్తామని అప్పటికీ పనులు సంతృప్తిగా ఉండాలని ఇంజనీరింగు అధికారులను ఆదేశించారు. రామకృష్ణ మిషన్ రోడ్డు ఆధునీకరణ పనులను పరిశీలించి, సంబందిత కాంట్రాక్టరుతో మాట్లాడుతూ ఎక్కువమంది పనివారిని, వస్తు సామగ్రిని ఏర్పాటు చేసుకొని నిర్ణీత గడువులోగా రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. లేకపోతే తగు చర్యలు చేపడతామని హెచ్చరించారు. తదుపరి బీచ్ రోడ్డులో ఉన్న వారసత్వ భవనాలు, టౌన్ హాలు, పాత మున్సిపల్ భవనాన్ని పరిశీలించి డిశంబరు నెలలోగా పనులు పూర్తిచేయాలని సంబందిత కాంట్రాక్టరును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీరు ఎం. వెంకటేశ్వర రావు, పర్యవేక్షక ఇంజనీరు వినయ కుమార్, కార్యనిర్వాహక ఇంజనీరు సుధాకర్, స్మార్ట్ సిటీ కన్సల్టన్సీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు వేగవంతం కావాలి



శ్రీకాకుళం : ఉద్దానం త్రాగునీరు ప్రాజెక్ట్ వేగవంతం కావాలని జిల్లా కలెక్టర్ జె. నివాస్ అన్నారు. ఉద్దానం తాగు నీటి ప్రాజెక్టుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో మంగళ వారం సమావేశం జరిగింది. ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి కావాడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో అత్యద్భుత ప్రాజెక్ట్ గా నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచనలు చేసారు. వంశధార నీటిని తాగు నీటిగా కల్పించడం వలన ఉద్దానం ప్రాంత ప్రజలు ఎన్నాళ్లగానో వేచి చూస్తున్న శుద్ధ జలాలు అందే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. త్వరగా పూర్తి చేసి ఉద్దానం ప్రజల కోరిక నెరవేర్చడమే కాకుండా వారి హృదయాల్లో నిలిచిపోవాలని అన్నారు. రహదారులు, భవనాల శాఖ, జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్టు పైపు లైన్లు వేయునపుడు అవసరమగు అన్ని చర్యలు సకాలంలో పూర్తి చేసి పనులు వేగవంత కావడానిక చేయూతను అందించాలన్నారు. పైపులైను రూటులో ఉన్న జలవనరులు, వివిధ నిర్మాణాలు, చెరువులు, కాలువలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని నిబంధనలకు అనుగుణంగా పనులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఉద్దానం ఏడు మండలాల్లో కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో శుద్ధ జలాలను రూ.7 వందల కోట్లతో తాగు నీటి ప్రాజెక్టును చేపట్టుటకు పరిపాలనాపరమైన ఆమోదాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. హిరమండలం వంశధార రిజర్వాయర్ వద్ద ఇంటేక్ వెల్ నిర్మించి అచ్చట నుండి పైపు లైను ద్వారా వజ్రపు కొత్తూరు మండలంలో 121 గ్రామాలు, పలాసలో 86 గ్రామాలు, మందసలో 225 గ్రామాలు, సోంపేటలో 74 గ్రామాలు, కవిటిలో 118 గ్రామాలు, కంచిలిలో 138 గ్రామాలు, ఇచ్ఛాపురంలో 45 గ్రామాలు వెరశి ఏడు మండలాల్లో 807 గ్రామాలకు తాగు నీటిని అందించుటకు ప్రతిపాదించడం జరిగింది. ఈ 807 ఆవాసాలలో 4.69 లక్షల మంది జనాభా నివశిస్తున్నారు. ప్రాజెక్టును 2051 సంవత్సరం వరకు అవసరాలకు తగిన విధంగా రూపకల్పన చేస్తున్నారు. ఏడాదికి 1.12 టిఎంసి నీరు అవసరమని గుర్తించడం జరిగింది. ఇందుకు 16 ప్రదేశాలలో ఓవర్ హెడ్ బేలన్సింగు రిజర్వాయర్లు, 23 ప్రదేశాల్లో గ్రౌండు లెవెల్ బేలన్సింగు రిజర్వాయర్లు నిర్మించుటకు, మెళియాపుట్టి మండలం మకనపల్లి, పలాస మండలం టెక్కలిపట్నం వద్ద హెడ్ వర్కులను ఏర్పాటు చేయుటకు ప్రణాళికలు రూపొందించారు. మొత్తం 1062 కిలోమీటర్ల మేర పైపు లైన్లు వేయుటకు, 51 సంపులు నిర్మించుటకు ప్రతిపాదించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్, డివిజనల్ అటవీ అధికారి సందీప్ కృపాకర్, జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీరు టి.శ్రీనివాసరావు, రహదారులు భవనాల శాఖ పర్యవేక్షక ఇంజనీరు కె.కాంతిమతి, వంశధార పర్యవేక్షక ఇంజనీరు డోల తిరుమల రావు, ఇపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజనీరు ఎన్.రమేష్, జాతీయ రహదారుల సంస్థ ఇంజనీరు ఎస్.బసవ రాజు, సంబంధిత మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవ జూనియర్ కళాశాల యన్.యస్.యస్ ఆధ్వర్యంలో

# ఎయిడ్స్ నివారణ వారోత్సవాలు




అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్దానిక శ్రీ సత్యదేవ జూనియర్ కళాశాల యన్.యస్.యస్ వాలంటీర్లు ఆద్వర్యంలో మంగళవారం కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని జరిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన దేవస్థానం ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి శ్రీరామ్ మాట్లాడుతూ విదిగా ప్రతి పౌరుడు ఎయిడ్స్ గురించి అవగాహన కలిగి ఉండాలని ఆరోగ్య నియమాలు విధిగా పాటించాలని ఎయిడ్స్ గురించి విద్యార్థులు ధైర్యంగా మాట్లాడ గలగాలని సూచించారు.

అలాగే పెయిత్ యూత్ వాలంటీర్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ మరియు ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మెనిటరింగ్ కమిటీ సభ్యురాలు కృష్ణవేణి మాట్లాడుతూ కామర దశలో విద్యార్థులు చాలా అపోహలు కలిగి చెడు పట్ల చాలా ఆకర్షితులై తమ భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని ఎయిడ్స్ పట్ల అప్రమత్తం కల్గి ఉండాలని ఎయిడ్స్ వల్ల చాలా కుటుంబాలు వీధిన పడ్డాయని ఈ వ్యాధి బారిన పడకూడదని సూచించారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి వచ్చిన ఏయన్ఎమ్ పార్వతీ,భవాని తదితరులు విద్యార్థిని విద్యార్థులకు ఎయిడ్స్ గురించి తగు జాగ్రత్తలు గురించి వివరించారు.అలాగే యన్.యస్.యస్ ప్రోగ్రాం ఆఫీసర్ గంటసాల వెంకట్ మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల జాగ్రత్త చేసే భాద్యతలు యన్.యస్.యస్ వాలంటీర్లు విద్యార్థిని,విద్యార్థులు తీసుకోవాలని తద్వారా ఆరోగ్య వంతమైన మెరుగైన సమాజాన్ని నిర్మించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ గిరి అధ్యక్షత వహించారు.అలాగే కళాశాల అధ్యాపకులు శర్మ ,భద్రరావు ,కృష్ణవేణి ప్రసాద్ పాల్గొన్నారు.

అనంతరం కళాశాల నుండి ర్యాలీ నిర్వహించారు. యన్.యస్.యస్ ప్రోగాం అధికారిణి మాణిక్యాంబ ఆద్వర్యంలో పెద్ద సంఖ్యలో యన్.యస్.యస్ వాలంటీర్లు, ఆశా వర్కర్లు ఎయన్ఎమ్ లు తదితర వైద్య సిబ్బంది,కళాశాల అధ్యాపకులు సూరిబాబు, సతీష్, గోవింద్,కొండ బాబు ఎయిడ్స్ అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు.

# 24వవార్డు లో వైఎస్ఆర్ క్రికెట్ కప్ పోస్టర్ ఆవిష్కరణ



మద్దిలపాలెం : జననేత, దేశంలో అనతి కాలంలోనే దేశం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా పరిపాలన వ్యవస్థ ను నడిపిస్తున్న నేత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగ రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి మరియు ప్రగతి భారతి ఫౌండెషన్ అధ్వర్యం లో క్రికెట్ టౌర్నమెంట్ నిర్వహించడం జరుగుతుంది,ఈ సందర్బంగా ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె కె రాజు ఆదేశాలు మేరకు 24 వ వార్డ్ వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టి కార్పొరేటర్ అభ్యర్థిని సాడి పద్మా రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కప్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం లో వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు. యువతలో క్రీడా స్ఫూర్తిని మెరుగుపరుచుటకు, ఆటల ద్వారా శక్తిని,ఆహ్లాదాన్ని పెంపొందించుటకు ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. 24 వ వార్డ్ లో యువకులు పాల్గొని ఈ యొక్క క్రికెట్ టౌర్నమెంట్ ను విజయవంతం చేయాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమం లో వార్డ్ గ్రామ పెద్దలు మహిళా నాయకులు, క్రీడా యువకులు, కార్యకర్తలు తదుపరి వారు పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లకు సత్కారం



గాజువాక : రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి 56 బి సి కుల సంఘాలకు చైర్మన్, డైరెక్టర్లను నియమించి శుభసందర్భంగా రాష్ట్రవ్యాప్త రెడ్డిక (బి సి) సంఘం డైరెక్టర్లు అందరూ గాజువాక నియోజకవర్గం వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టి ఇంచార్జ్ శ్రీ తిప్పల దేవన్ రెడ్డిని పెదగంట్యాడ ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా తిప్పల దేవన్ రెడ్డి డైరెక్టర్లు అందరికి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన పదవులకు తగిన న్యాయం చేయాలని, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, ప్రెసిడెంట్ మారం బలరాంరెడ్డి,రౌతు భాస్కర్ రెడ్డి, సి అప్పలరెడ్డి, పేరం రమణారెడ్డి, పేరం మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ చేయూత లబ్ధిదారులకు అవగహన



అచ్యుతాపురం : మండలంలో మల్లవరం సచివాలయంలో వైఎస్ఆర్ చేయూత లబ్ది దారులకు పశువులకు సంబందించిన అవగహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెటర్నరి వైద్యాధికారిణి వాత్స్యావి మాట్లాడుతూ నాణ్యమైన పశువు లను కనుగోలు చేయడం , భీమాసౌకర్యం వంటి ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పిన్నంరాజు వాసు, మాజీ సర్పంచ్ చిన్ని శ్రీనివాసరావు, కండిపల్లి శ్రీనివాసరావు, పందల శ్రీనివాసరావు,వివోలు తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలు, మేకల యూనిట్లు పంపిణీ చర్యలు

శ్రీకాకుళం : గొర్రెలు, మేకల యూనిట్లు పంపిణీకి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జె నివాస్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గొర్రెలు, మేకల యూనిట్లు పంపిణీకి కార్యాచరణపై మంగళవారం సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా లక్ష్యాలను నిర్ణయించాలని ఆయన ఆదేశించారు. వై.యస్.ఆర్ చేయూత పథకం క్రింద ప్రయోజనం పొందిన లబ్ధిదారుల వివరాలు పరిశీలించాలని పేర్కొన్నారు. గొర్రెలు, మేకలు కొనుగోలుకు అవసరమగు మార్కెట్లను పరిశీలించాలని ఆయన ఆదేశించారు.

ఆసరా, సంక్షేమ విభాగం జాయింట్ కలెక్టర్ ఆర్.శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ వై. యస్. ఆర్ చేయూత పథకం క్రింద గొర్రెలు, మేకల యూనిట్లు పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని చెప్పారు. చేయూత క్రింద అందిన మొత్తం బ్యాంకు ఖాతాలలో ఉండాలని అటువంటి లబ్దదారులను పరిగణనలోకి తోసుకోవాలని సూచించారని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో 1000 యూనిట్లు లక్ష్యం కాగా 5296 మంది దరఖాస్తు చేశారని చెప్పారు. జిల్లాలో 10 మండలాల్లో మేకలు, గొర్రెలు అధికంగా పెంచుతున్నారని, అటువంటి ఆసక్తి ఉన్నవారికి యూనిట్లు మంజూరు వలన ప్రయోజనం ఉంటుందని ఆయన తెలిపారు.

ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ జెడి ఏ.ఈశ్వర రావు, డి ఆర్ డి ఏ పిడి బి.శాంతి, డిసిఓ కె.మురళి కృష్ణ మూర్తి, ఎల్డిఎం జి విబిడి హరి ప్రసాద్, ఎపిడిలు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## చట్టవిరుద్ధ కార్యాకలాపాలకు పాల్పడితే ఉపేక్షించం

ఏదైనా హామీ ఇస్తే ఖచ్చితంగా చేసి తీరుతాం. ఆ విధమైన నమ్మకం ప్రజల్లో ఎప్పుడో కలిగింది. ప్రభుత్వంపై ప్రజల్లో ఓ నమ్మకాన్ని కలిగించాం. దటీజ్ జగన్. చంద్రబాబు ఏదైనా చెప్పాడు అంటే అది చేయడు అనేది క్రెడిబులిటి. మనం చేసే పనుల వళ్ల మనకు క్రెడిబులిటి వస్తుంది. చంద్రబాబు హయాంలో ఇన్సూరెన్స్ కట్టాలంటే రైతులు భయపడేవారు. మేం 59 లక్షల 70వేల మంది రైతులను ఇన్సూరెన్స్ ప్రీమియం పరిధిలోకి తీసుకొచ్చాం. రైతుల తరపున ప్రభుత్వమే ప్రీమియం చెల్లించే బాధ్యత తీసుకుంది. 2019లో రైతులు, రాష్ట్రప్రభుత్వం తరపున రూ.1030 కోట్లు చెల్లించాం. డిసెంబర్ 15న రూ.1227 కోట్లు బీమా ప్రీమియం చెల్లిస్తున్నాం' అని అన్నారు.

### నిమ్మల సస్పెండ్

మరోవైపు సభలో టీడీపీ సభ్యులపై స్పీకర్ తమ్మినేని సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ సభ్యులు సభకు ఆటంకం కలిగిస్తున్నారని మండిపడ్డారు. ఎవరి సీట్లలో వారు కూర్చోవాలని పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా.. కనీసం ఆయన మాటాలను పట్టించుకోలేదు. సభ సజావుగా సాగేందుకు టీడీపీ సభ్యులు సహకరించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. పట్టించుకోలేదు. దీంతో టీడీపీ సభ్యుడు నిమ్మల రామానాయుడును ఒక్కరోజు పాటు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ తెలిపారు.

సత్యప్రసాద్ ఆరోపణలపై ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు.

ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ జూదానికి సంబంధించి ఎక్కడైనా, ఎవరైనా తప్పు చేస్తే వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకురండి.. తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటాం.కర్నూలు జిల్లాలో మంత్రి జయరామ్ దూరపు బంధువు ఒకరు గ్రామంలో ఆ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిసిన వెంటనే పోలీసులు దాడి చేశారు. ఆ నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. మంత్రి బంధువు అని చెప్పి ఊరుకోకుండా కేసు పెట్టడం జరిగింది. ఆ మర్నాడు స్వయంగా మంత్రి జయరామ్ కూడా స్పందించారు. ఎవరు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించబోమని చెప్పారు. మా ప్రభుత్వం ఆ విధంగా పని చేస్తున్నందుకు గర్వపడుతున్నాను. తప్పు ఎవరు చేసినా తప్పే.. ఎక్కడైనా సరే ఇలాంటివి జరుగుతున్నాయని తెలిస్తే వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకురండి.

పోలీసులకు కూడా స్పష్టంగా ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఎక్కడా, ఎవరినీ వదిలిపెట్టడమనేది ఉండదు.. కచ్చితంగా చర్య తీసుకుంటాం.దీనిలో భాగంగానే ఆన్‌లైన్ జూదంకు కళ్లెం వేయాలనే అంశంతో నేడు జూదాన్ని నిషేధిస్తూ చట్టం తీసుకు రావడం జరిగింది.ఆన్‌లైన్ జూదానికి పిల్లలు అలవాటు కావొద్దనే వారి భవిష్యత్తు చెడిపోకూడదు అన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నాం.గత అయిదేళ్లలో ప్రభుత్వం దాన్ని నియంత్రించడానికి కనీసం చట్టం కూడా ఎందుకు తీసుకు రాలేదు? ఎందుకు చర్యలు తీసుకోలేకపోయారు? కనీసం ఆ ప్రయత్నం కూడా జరగలేదు. ఇవాళ ఒక మంచి కార్యక్రమం జరుగుతుంటే దాన్ని స్వాగతించాల్సింది పోయి.. రాజకీయంతో దాన్ని ట్విస్ట్ చేయాలన్న దిక్కుమాలిన ఆలోచన చేస్తున్న తీరు ఏ మాత్రం బాగా లేదని' సీఎం స్పష్టం చేశారు.

## రైతులు విత్తనాలు పొందాలంటే గ్రామ సచివాలయంలో సంప్రదించవచ్చు

ఉంది. రైతులకు మేలు చేసేందుకు పాడి పరిశ్రమకు సంబంధించి అమూల్ తో ఒప్పందం కుదుర్చుకుంది. అమూల్ తో రైతులకు లాభం చేకూరనుంది.

రైతు ఆత్మహత్య చేసుకుంటే ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను రూ. 5 లక్షల నుంచి 7 లక్షల రూపాయలు పెంచాం. గత ప్రభుత్వం చెల్లించని బకాయిలు మేము అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లించాం. ఆర్‌బికే అనేది ఒక వినూత్నమైన ఆలోచన.. త్వరలో ఈ ప్లాట్ ఫామ్‌ను తీసుకొస్తాం.' అని కురసాల తెలిపారు.

# బ్రహ్మోస్ క్షిపణిని పరీక్షించిన నేవీ

ఆ మిస్సైల్ ధ్వంసం చేసింది. ల్యాండ్ అటాక్ వర్షన్‌కు చెందిన బ్రహ్మోస్ క్షిపణిని ఆ రోజున పరీక్షించారు. భారతీయ ఆర్మీ నేతృత్వంలో ఆ పరీక్ష జరిగింది. ఇవాళ మాత్రం భారతీయ నేవీ ఆ మిస్సైల్‌ను పరీక్షించింది. ఐఎన్ఎస్ రణ్‌విజయ్ నుంచి బ్రహ్మోస్ యాంటీ షిప్ మిస్సైల్‌ను పరీక్షించారు. బంగాళాఖాతంలో అతి సుదీర్ఘ దూరంలో ఉన్న టార్గెట్‌ను ఆ క్షిపణి ధ్వంసం చేసింది.

## మార్చి నాటికి మార్కెట్‌లోకి కొవిషీల్డ్ వ్యాక్సిన్

సందర్శించారు. అనంతరం సంస్థ సీఈఓ అదర్ పూనావాలా వ్యాక్సిన్ అత్యవసర వినియోగానికి అనుమతి కోసం అపెక్స్ డ్రగ్ రెగ్యులరేటర్‌కు రెండువారాల్లో దరఖాస్తు చేయనున్నట్లు ప్రకటించారు.

యూకే, బ్రెజిల్ నుంచి వచ్చిన చివరి దశ వ్యాక్సిన్ ట్రయల్స్ మధ్యంతర ఫలితాలను ఆస్ట్రాజెనెకా విశ్లేషించింది. వ్యాక్సిన్ రెండు వేర్వేరు మోతాదుల్లో 70.4శాతం ప్రభావంతంగా ఉందని చెప్పింది. సీరం ఇనిస్టిట్యూట్ తయారీ, నిల్వ చేసే లైసెన్స్ కింద 40 మిలియన్ మోతాదులను ఉత్పత్తి చేసిందని కంపెనీ తెలిపింది. మరో 60-70 మిలియన్ మోతాదులను తయారు చేయనున్నట్లు ప్రకటించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి వంద మిలియన్ డోసులు, జూన్-జూలై నాటికి 400 మిలియన్ మోతాదులను చేరుకోవాలని ఆశిస్తున్నట్లు పేర్కొంది.

## ముంచుకొస్తున్న 'బురేవి' ముప్పు

(శ్రీలంక)కు తూర్పు ఆగ్నేయ దిశగా సుమారు 710 కిలోమీటర్లు కన్యాకుమారి (ఇండియా)కి ఆగ్నేయ దిశగా సుమారు 1,120 కిలోమీటర్లు దూరంలో కేంద్రీకృతమైంది. ఇది రాగల 12 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడుతోంది. రానున్న 24 గంటల్లో మరింత బలపడి తుపానుగా మారుతుందని వాతావరణ శాఖాధికారులు చెబుతున్నారు. ఈ తుపాన్‌కు 'బురేవి' తుపాన్‌గా నామకరణం చేశారు. ఇది పశ్చిమ వాయువ్య దిశగా పయనిస్తూ సుమారు డిసెంబర్ రెండో తేది సాయంత్రం శ్రీలంక మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. ఇది దాదాపు పశ్చిమ దిశగా ప్రయాణించి ఆ తర్వాత డిసెంబర్ మూడు ఉదయానికి కోమారిన్ ప్రాంతంలోనికి ప్రవేశిస్తుంది.

ఈ ప్రభావం వల్ల రానున్న 36 గంటల్లో దక్షిణ కోస్తా ఆంధ్రలో తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉండగా, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాయలసీమ ప్రాంతంలో ఉరుములు, మెరుపులతోపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని, చిత్తూరు జిల్లాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# రూ.2.25 కోట్లతో కార్పస్ ఫండ్

## జిల్లా కలెక్టర్ జె.నివాస్



శ్రీకాకుళం : అభం శుభం తెలియని ఎయిడ్స్ బాధిత చిన్నారుల కోసం రూ.2.25 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటుచేసామని, ఈ నిధి నుండి చిన్నారులకు అవసరమైన న్యూట్రీషన్ ఫుడ్ ను ఈ నెల నుండే అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ జె.నివాస్ వెల్లడించారు. డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా రెడ్ క్రాస్ సంస్థ కార్యాలయంలో ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో 230 మంది ఎయిడ్స్ బాధిత చిన్నారులు ఉన్నారని, ఎయిడ్స్ అంటే ఏమిటో కూడా తెలియని అభం శుభం చిన్నారులు వారని అన్నారు. అటువంటి చిన్నారులను ఆదుకునేందుకు రూ.2.25 కోట్లతో కార్పస్ ఫండ్ ను ఏర్పాటుచేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఈ నిధి నుండి చిన్నారులకు అవసరమైన న్యూట్రీషన్ ఫుడ్ ను ఈ నెల నుండే అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎయిడ్స్ బాధిత చిన్నారులను పాఠశాలల్లో చేర్చకపోవడంపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, రెడ్ క్రాస్ మరియు సి.వి.నాగజ్యోతి ఛారిటబుల్ ట్రస్ట్ తరపున ఒక గదిని కేటాయించి అటువంటి చిన్నారులకు ఉచిత విద్యాబోధన ఏర్పాటుచేయనున్నట్లు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఇవేకాక ఎయిడ్స్ బాధిత చిన్నారులకు అవసరమైన అన్ని ఏర్పాట్లుచేస్తామని, ఎట్టి పరిస్థితిల్లో వారికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్నివిధాల ఆదుకుంటామని వివరించారు.

ఈ సమావేశం అనంతరం 17 రకాల న్యూట్రీషన్ కిట్ ను 20 మంది ఎయిడ్స్ బాధిత చిన్నారులకు కలెక్టర్ అందించారు.

# విజయభాను సంపాదకీయం

## ప్రజల పాత్రే ప్రధానం

ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి ఉండాలా?మార్కెట్ ఆర్థికవ్యవస్థ ఉండాలా అనే మౌలిక ప్రశ్న ప్రపంచదేశాలను ఎంతోకాలంగా వేధిస్తున్నది. ఇందుకు సంబంధించిన ప్రయోగాలకు మన దేశం కేంద్ర బిందువు అయింది. ప్రధాని పీవీ సారథ్యంలో మన దేశం ఆర్థిక సంస్కరణల వైపు నిర్ణయాత్మకమైన మలుపు తీసుకున్న తర్వాత కూడా ఈ చర్చ ముగిసిపోలేదు. అయితే ఈ అంశంలో పీవీ వైఖరి భిన్నమైనది. ప్రణాళికా, మార్కెట్ విధానాల్లో ఏ మార్గాన్ని చేపట్టినా వికేంద్రీకరణ జరపడం, ప్రజలను భాగస్వాములను చేయడమే అసలు లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రణాళికారచన, ఆచరణ- రెండూ పంచాయతీరాజ్ సంస్థకే దత్తం చేయాలని ముఖ్యమంత్రులకు సూచించారు.

నాదృష్టిలో ప్రణాళిక, మార్కెటు యంత్రాంగంలో ఏదైనా ఒకదానిని మాత్రమే ఎంపిక చేసుకోవాలనేది ప్రశ్న కాదు. ఏ విధంగా అట్టడుగు స్థాయి నుంచి పైవరకు వికేంద్రీకృత వ్యవస్థను శక్తిమంతం చేయడం, అభివృద్ధిలో ప్రజలను వాస్తవంగా భాగస్వాములను చేయడమనేది కీలకమైన ప్రశ్న. విధాన రచన ముఖ్యంగా కీలకమైన అంతరంగ విషయాలైన మానవ అభివృద్ధి, ఆర్థిక అభివృద్ధి రంగాలలో సంపూర్ణ దృక్పథాన్ని అభివృద్ధి చేయడంలో ఒక సమీకృతమైన పాత్రను పోషించడమే నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిజమైన సవాలు. రాష్ట్ర ప్రభుత్వాలు, పంచాయతీరాజ్ సంస్థలు ఈ విషయాన్ని కూలంకషంగా చర్చించి మార్గాన్ని అన్వేషించాలి.

అక్షరాస్యత, కుటుంబ సంక్షేమాలవంటి రెండు ముఖ్య రంగాలను ఉదాహరణగా తీసుకొని నా మనస్సులో ఉన్నదేమిటో విపులీకరించనివ్వండి. కొద్దికాలం క్రితం వయోజన విద్య ప్రభుత్వ బాధ్యతగానే భావించబడింది. సంపూర్ణ అక్షరాస్యతకు మొదట కేరళలోను ఇప్పుడు మరీ వెనుకబడిన ప్రాంతాలలో సైతం ప్రారంభించబడిన ప్రాంతీయమైన కాలపరిమితిగల ప్రజా ఉద్యమాలు ఈ మధ్యకాలంలో సాధించిన విజయాలు ఎనిమిదవ ప్రణాళికా కాలంలో నిరక్షరాస్యతను పూర్తిగా రూపుమాపగలమన్న విశ్వాసాన్ని కలిగించాయి. ఈ ఉద్యమాలు సమాజంలోని అందరు సభ్యులు, కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వేతర సంస్థలు (ఎన్జీవోలు) స్థానిక ప్రజలు మొదలైనవారందరి సహకారంతో నడిచాయి. ఈ విధంగానే ఎనిమిదవ ప్రణాళికలో కుటుంబ సంక్షేమం, జనాభా నియంత్రణలకు సంబంధించిన వ్యూహం, ప్రణాళికా రచన, ఆచరణ పాలనా విషయాలలో పూర్తి బాధ్యత పంచాయతీరాజ్ సంస్థలపై ఉంచుతుంది. ప్రజలను ఈ కార్యక్రమాలలో భాగస్వాములు చేయడంపై ఎక్కువగా ఆధారపడుతున్నది.

ఈ సందర్భంలో పార్లమెంటు సభ్యులను వారి వారి నియోజకవర్గాలలోని అభివృద్ధి కార్యక్రమాలలో పాత్రధారులను చేయాల్సిన అవసరం గురించి ప్రత్యేకంగా చెప్పదలచుకున్నాను. ఈ విషయంలో ఫిర్యాదులు రావడం కొనసాగుతున్నది.పార్లమెంటుకు మనం బాధ్యత కలిగి ఉన్నామనే సత్యాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రజాప్రతినిధులుగా పార్లమెంటు సభ్యులు వారి నియోజకవర్గంలోని విషయాలపై సహజంగానే ఆసక్తి కలిగి ఉంటారనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, దేశంలోని అభివృద్ధి కార్యక్రమాలలో వారిని పాత్రధారులను చేయుటకై ఒకే విధమైన పద్ధతి అవసరం ఎంతైనా ఉంది. ఫిర్యాదులు పదే పదే రావటం వల్ల ఈ విషయాన్ని ఈ సమావేశంలో లేవనెత్తాల్సి వచ్చింది. ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకోమని ముఖ్యమంత్రులకు విన్న విస్తున్నాను.

సవాళ్ళను ఎదుర్కొనుట: ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న సవాళ్ళను, 8వ ప్రణాళిక ఈ విధంగా ఎదుర్కోవాలనుకుంటున్నది. ప్రజల సాంఘిక వినిమయ అవసరాలకు చేసే కేటాయింపులలో ఎంతో వెనుకబడి ఉన్నాం. పేదరికం న్యాయమైన అవసరాల నిరాకరణ స్థాయి తగ్గినప్పటికీ ఇంకా ఆమోదించలేనంతగా ఉంది. అక్షరాస్యత ముఖ్యంగా స్త్రీలలో ఇప్పటికీ చాలా తక్కువ స్థాయిలో ఉంది. ఇంకా ఎక్కువగానే ఉన్న శిశు మరణాలు, తీవ్రమైన నిరుద్యోగ సమస్య ఆందోళన కలుగజేస్తున్నాయి. పెరుగుతూనే ఉన్న విత్త, బడ్జెట్ లోట్లు, తీవ్రమైన చెల్లింపుల సమతుల్యం పరిస్థితి, ద్రవ్యోల్బణం, అంతేకాక ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించి దాన్ని శక్తిమంతంగా, అంతర్జాతీయ పోటీని తట్టుకునేవిధంగా చేయాల్సిన సత్వర ఆవశ్యకతవైపు కూడా మనం దృష్టిసారించాల్సి అవసరం ఉన్నది.




మాజీ మంత్రి, ఉత్తర నియెజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరరావు పుట్టినరోజు వేడుకలు 54 వార్డ్ రవీంద్ర నగర్ లో టీడీపీ యువ నాయకుడు కార్తీక్ కుట్టా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి గంటా అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.




విశాఖ విమానాశ్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన 54వవార్డు టీడీపీ యువ నాయకుడు కార్తీక్ కుట్టా, మాధవరావు, పి.వి.రమణ, సుధ, మర్రిపాలెం చిన్నా, లక్ష్మణ్, నూకరాజు తదితరులు

## వీసీ ప్రసాద రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు





ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉపకులపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డిని పలువురు అభినందించారు. మంగళవారం ఉదయం ఆయన కార్యాలయంలో ఏయూ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుబ్రహ్మణ్యం, డిసిపి సురేష్ బాబులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పలువురు ఆచార్యులు, కళాశాలల యాజమాన్యాలు, ఉద్యోగులు వీసీ ప్రసాద రెడ్డికి అభినందనలు తెలిపారు.

## ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉద్యోగులకు మార్చి, ఏప్రియల్ నెలలకు సంబంధించిన మిగులు వేతనాలను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రికి ఏయూ ఉద్యోగుల సంఘం అద్యక్షుడు డాక్టర్ జి.రవికుమార్, ఆటా అద్యక్షులు ఆచార్య జాలాది రవిలు కృతజ్ఞతలు తెలిపారు. కోవిడ్ సమయంలో వేతనంలో సగం వేతనం ఇవ్వగా(డిఫర్డ్ శాలరీ) మిగిలిన వేతనాన్ని డిసెంబరు, జనవరి నెలలకు ఇవ్వడానికి అంగీకరిస్తూ ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల వీరు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులు సమస్యను పెద్దమనసుతో అర్ధం చేసుకుని సరైన సమయంలో వేతనాలు విడుదల చేయడం శుభ పరిణామమన్నారు.

## కవి సమయం

### మంచి మాట

మంచి మాట మహాత్ముల లక్షణం
మంచిగా మాట్లాడు, ప్రేమతో మాట్లాడు
సహృదయంతో, ఓదార్పునిస్తూ మాట్లాడు
చల్లని వెన్నెలలా
స్వాంతన కలిగించే మందులా
గిలిగింతలు పెట్టి తొలకరి జల్లులా
ప్రేమగా, ఆనందంగా
పరులకు సంతోషానిచ్చే విధంగా
మన పలుకులు వుండాలి
పదునైన ఆయుధంతో
తుట్లు పొడిచేలా వచ్చే మాటలు
వినాశ హేతువు, విధ్వంస కారకం

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : కార్తీక; తిథి : విదియ సా.4.47; మృగశిర ఉ.10.07; సా.వ.6.58ల 8.39. | బుధవారం 02-12-2020

**మేషం** : పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతారు. విద్యార్థులకు ప్రింటింగ్ రంగాలవారికి సదా వకాశాలు లభిస్తాయి. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో పునరాలోచన అవసరం. బంధువులను కలుసుకుంటారు.

**వృషభం** : కోర్టు వాదోపవాదాల్లో ప్లీడర్లకు గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగస్తులు, ఒత్తిళ్ళు, ఆకర్షణలకు దూరంగా ఉండటం అన్నివిధాలా క్షేమదాయకం. మీ శ్రీమతి సూటిపోటి మాటలు అసహనం కలిగిస్తాయి. దైవ సేవా కార్యాక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. అనుకోకుండా నిరుద్యోగుల యత్నాలు ఒక కొలిక్కి రాగలవు.

**మిథునం** :బ్యాంకు వ్యవహారాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల మెళకువ అవసరం. వీలైనంతవరకు మీ పనులు మీరే చూసుకోవటం ఉత్తమం. ఆదాయాన్ని కన్నా ఖర్చులు అధికంగా ఉంటుంది. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునారాలోచన మంచిది. విద్యార్థినులకు ఒత్తిడి ఆందోళనలు ఎదుర్కొంటారు.

**కర్కాటకం**:వ్యాపారవేత్తలు ప్రస్తుత పరిస్థితిని కొనసాగ నివ్వడం మంచిది. ప్రముఖులను కలుసుకుంటారు. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. ప్రింటింగ్ రంగాలవారికి సదవకాశాలు లభిస్తాయి. మీ సంతానం మొండివైఖరి మీకెంతో చికాకు కలిగిస్తుంది. హామీలు చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి.

**సింహం** :విద్యార్థులు తోటి విద్యార్థులతో విందులు, వేడుకలలో పాల్గొంటారు. అవసరానికి సరిపడ ధనం సమకూరుట వల్ల ఆర్థిక ఇబ్బంది అంటూ ఏదీ ఉండదు. మీ అవసరాలకు కావలసిన ధనం సమయానికి సర్దుబాటు అవుతుంది. ప్రైవేట్ ఫైనాన్సు సంస్థలో పొదుపు చేయటం మంచిది కాదని గమనించండి.

**కన్య** : పెద్దల జోక్యంతో అనుకోకుండా ఒక సమస్య సానుకూలమవుతుంది. పంతాలకు పోకుండా బంధువులతో ఆదరంగా మెలగండి. బంధుమిత్రుల కలయికతో ఉత్సాహం చోటుచేసుకుంటుంది. దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తుతాయి. స్త్రీలకు షాపింగ్ విషయాలలో అపరిచిత వ్యక్తులపట్ల మెళకువ అవసరం.

**తుల** : ఆత్మీయుల నుంచి అందిన ఆహ్వానం మిమ్ములను ఇరకాటానికి గురిచేస్తుంది. విలాసవస్తువులు అమర్చుకోవాలనే స్త్రీల కోరికలు నెరవేరుతాయి. చేతి వృత్తులు, చిరు వ్యాపారులకు అన్నివిధాలా కలిసివస్తుంది. ప్రయాణాలలో ఇబ్బందులు తలెత్తుతాయి. నిరుద్యోగలకు రాతపరీక్షలు, ఇంటర్వ్యూలు సత్ఫలితాలనిస్తాయి.

**వృశ్చికం** : పాత మిత్రులను కలిసి వారికి శుభాకాంక్షలు అందజేస్తారు. నూతన పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. ఉద్యోగస్తులకు పైఅధికారుల నుంచి మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. నూతన వస్త్రప్రాప్తి ప్రముఖుల కలయిక ప్రయోజనకరంగా ఉంటుంది. రుణ విముక్తులు కావడంతో మానసికంగా కుదుటపడతారు.

**ధనుస్సు** :రాజకీయ నాయకులు పార్టీ సభ్యులతో కలిసి విందు, వినోదాలలో పాల్గొంటారు. సంఘంలో మీ స్థాయి పెరుగును. పెద్దల ఆరోగ్యం కుదుటపడుతుంది. వ్యాపారరీత్యా దూరప్రయాణాలు చేస్తారు. బంధుమిత్రులకు, ప్రముఖులకు శుభాకాంక్షలు అందజేస్తారు. టెక్నికల్, ఎలక్ట్రానిక్, కంప్యూటర్, రంగాల్లో వారికి ఒత్తిడి తప్పదు.

**మకరం** :ఆర్థికంగా ఎదగాలనే మీ ఆశయం నిదానంగా ఫలిస్తుంది. కుటుంబీకులతో కలిసి విందులు, వినోదాలు, సమావేశాలు ఉల్లాసంగా కలిగిస్తాయి. దైవ, పుణ్య, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. నూతన వస్తువులను కొనుగోలు చేస్తారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేస్తారు. ధనం చేతిలో నిలబడటం కష్టమే.

**కుంభం** : విద్యార్థులకు హడావుడి, తొందరపాటు తగదు. వస్త్ర, బంగారం, వెండి, లోహ వ్యాపారస్తులకు సంతృప్తి కానవస్తుంది. విందు, వేడుకలలో చురుకుగా పాల్గొని అందరిని ఆకర్షిస్తారు. కళ, క్రీడా, సాంకేతిక రంగాలవారికి ప్రోత్సాహకరం. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు, రాత పరీక్షలలో మెళకువ, ఏకాగ్రత అవసరం.

**మీనం** : విందులలో పరిమితి పాటించండి. వాహనం ఇతరులకు ఇచ్చిఇబ్బందులను ఎదుర్కొంటారు. ఉపాధ్యాయులు పైఅధికారులతో సంభాషించినపుడు మెళకువ అవసరం.



## లక్ష్మీదేవిని పూజిస్తే.. శుక్రగ్రహ దోషాలు తొలగిపోతాయట!



జీవితంలో కొన్ని సమస్యలకు పరిష్కారాలు వేరే కావచ్చు. అయితే మరికొన్ని సమస్యలకు అవసరాలకు డబ్బే ప్రధానం. ధనానికి ఇబ్బందులు, ఆర్థిక సమస్యలు, దారిద్ర్యంతో కష్టాలు అనుభవిస్తుంటే.. ఇక ఆలోచించకుండా శుక్రవారం మహాలక్ష్మీదేవిని పూజించాల్సిందే.

ఆ తల్లి కటాక్షం కావాలంటే అంకితభావంతో కూడిన పూజాభిషేకాలు జరపవలసి వుంటుంది. శుక్రవారం రోజున భక్తిశ్రద్ధలతో సేవించవలసి వుంటుంది.

అందువలన అమ్మవారు ప్రీతి చెందుతుందనీ, ఫలితంగా దారిద్ర్యం తొలగి పోయి సంపదలు ప్రసాదించబడతాయని పురోహితులు అంటున్నారు. అంతేకాదు అమ్మవారిని అర్చించడం వలన శుక్ర గ్రహ సంబంధమైన దోషాలు కూడా తొలగిపోతాయని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి.

అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తికాకపోవడం, అవమానాలు ఎదురుకావడం, అనారోగ్యం వంటివి శుక్రగ్రహ దోషంతో ఏర్పడుతాయి. అందుచేత శుక్రగ్రహ దోషాలను తొలగించుకోవాలంటే..

లక్ష్మీపూజ తప్పనిసరి అని పండితులు అంటున్నారు. అందుచేత శుక్రవారం రోజున ఉపవాస దీక్షను చేపట్టి, అమ్మవారి ఆలయంలో...

ప్రదక్షిణలు చేయడం వలన ... పూజాభిషేకాలు జరపించడం వలన ఆశించిన ఫలితం లభిస్తుందని వారు సూచిస్తున్నారు.



# 32వవార్డులో పదివేలమంది మహిళలు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమం



విశాఖపట్నం : మంగళవారం పుట్టినరోజు జరుపుకున్న కెఎన్ ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కందుల నాగరాజు బుధవారం నుంచి 32వ వార్డులోని దాదాపు పదివేల మందికి చీరలు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగ రాజుకు వార్డులోని మహిళలు, వృద్ధులు హారతు లతో స్వాగతిస్తూ తమ ఆనందాన్ని వ్యక్త పరుస్తున్నారు. చీరలు నాణ్య మైనవని, ఇప్పటికే చాలాసార్లు నాగరాజు నుంచి సహాయం అందుకున్నట్లు మహిళలు తెలిపారు.

నాగరాజు సుఖసంతో షాలతో నూరేళ్లు జీవించాలని వృద్ధులు దీవెనలు అంద జేశారు. పదివేలమందికి చీరలు దుప్పట్లు ఇంటిఇంటికీ తిరిగి వ్యక్తి గతంగా తాను, తన ట్రస్టు సభ్యులు అందజేస్తామని కందుల నాగరాజు తెలిపారు.

# అప్పన్న ను దర్శించుకున్న సినీ డైరెక్టరు అనిల్ రావిపూడి

## అప్పన్న దయతో ఎఫ్ 3 విజయవంతం తథ్యం





సింహాచలం : శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారిని సుప్రీమ్ ఎఫ్ 2 మొదలగు సినిమాల దర్శకుడు అనీల్ రావిపూడి కుటుంబ సమేతంగా మంగళవారము నాడు స్వామివారిని దర్శించుకున్నారు. సింహగిరి కి చేరుకున్న వీరికి ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనము అనంతరం అధికారులు స్వామివారి తీర్థప్రసాదలను అందజేశారు అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఒక సినిమా షూటింగ్ నిమిత్తం మరియు ఎఫ్ 3 డిస్కషన్స్ నిమిత్తం అరుకులో బస చేసినట్లు చెప్పారు. ఎఫ్ 3 సినిమా షూటింగ్ స్క్రిప్టు అప్పన్న పాదాల చెంత పూజచేసి షూటింగు ప్రారంభిస్తామని స్వామి దయతో ఎఫ్ 3 విజయవంతం అవుతందని అన్నారు.

ఈ సందర్భంగా ఆయనతో పాటు టిడిపి నాయకలు పీ వీ నరసింహం పంచ దార్ల శ్రీనివాస్ గుసిడి బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏఆర్టీ కేంద్రంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

## బాధితులకు పౌష్టికాహారం దుప్పట్లు మిఠాయిలు పంపిణీ చేసిన సిబ్బంది



నర్సీపట్నం : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రిలో బాధితులకు పోషకాహారంతో పాటు దుప్పట్లను, మిఠాయిలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఏ ఆర్ టి కేంద్రం వైద్యురాలు డాక్టర్ పల్నాటి విజయ కుమారి ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఏరియా ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ నీలవేణి దేవి, నోడల్ అధికారి డాక్టర్ సింహాద్రి హాజరయ్యారు. నర్సీపట్నం డివిజన్ పరిధిలో రెండు వేల తొమ్మిది వందల మందికి ప్రస్తుతం ఇక్కడ నుండి సేవలు అందుతున్నాయి అన్నారు. వీరిలో పెన్షన్ పొందుతున్న వారు, గర్భిణీ స్త్రీలు బాలింతలు చిన్న పిల్లలు కూడా ఉండటం విచారకరమన్నారు.కరోన నేపథ్యంలో బాధితుల అందరికీ ఇంటికి వెళ్లి మందులు అందించినట్లు తెలిపారు. మందులు వాడటం మధ్యలో మానేసి వారి సంఖ్య తగ్గించేందుకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి గతంలో అవార్డు వచ్చిందని, మంచి గుర్తింపు లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎయిడ్స్ బాధిత రోగులకు దుప్పట్లను మిఠాయిలను పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఏఆర్టీ సిబ్బంది, ఐసిటిసి సిబ్బంది, ఎస్టిఐ సిబ్బంది తో పాటు సమిధ స్వచ్ఛంద సంస్థ నుండి అప్పారావు తదితరుల సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సూపర్డెంట్ డాక్టర్ నీలవేణి దేవి విలేఖర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి హెడ్ నర్సు పద్మావతి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

### ఎయిడ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం

# మనమందరం భాగస్వాములు కావాలి

## - గాజువాక బీజేపీ కన్వీనర్ కె.ఎన్.ఆర్




గాజువాక : ఎయిడ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం మనమందరం భాగస్వాములు కావాలని గాజువాక బీజేపీ కన్వీనర్ డాక్టర్ కర్ణంరెడ్డి నర్సింగరావు పిలుపునిచ్చారు. మంగళవారం గాజువాక ఆఫీషల్ కాలనీ లో ని డిజైర్ సొసైటీ ప్రతినిధి లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ అవగాహన ర్యాలీని బీజేపి కన్వీనర్, డాక్టర్. కర్ణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్, కే.ఎన్.ఆర్ మాట్లాడుతూ 1981 సం.లో అమెరికాలో నలుగురు స్వలింగ సంపర్కు లతో మొదలైన ఈ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా నేటికి 3.3 కోట్ల మందికి సోకిందని, ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు 1988 డిశంబరు నెల 1 వ తేదీ నుండి ప్రపంచ ఎయిడ్స్ డే గా నిర్వహిస్తున్నారని చెప్పారు. మొదట్లో అవగాహన లేక ప్రజలు భయ పడేవారని, ప్రస్తుతం మందులు, ఇంజక్షన్లు వాడటం, మంచి పౌష్టికాహారం తీసుకోవడం వలన రోగి జీవిత కాలం పెరిగిందని చెప్పారు. బార్బర్ సాప్లో ఒకరికి వాడిన రేజర్ మరొకరు వాడటం వలన, ఒకరికి వాడిన ఇంజక్షన్ సిరంజన్ మరొకరికి వాడటం వలన ఎయిడ్స్ వ్యాది సోకే అవకాశం ఉందని ప్రజలు ఎయిడ్స్ పై అవగాహన కల్గి ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో...జిల్లా మెంటల్ ఆరోగ్య సంస్థ తరపున ప్రముఖ సైకాలజిస్ట్ డా.భవానీ, రవీంద్ర పబ్లిక్ స్కూల్ అధినేత పరశురాం, బీ.జే.పి 72వ వార్డు కార్పొరేటర్ అభ్యర్ధి సిరసపల్లి నూకరాజు, మహిళా మోర్చా అధ్యక్షురాలు రోహిణి, పుష్ప లత, శివ తదితరులు పాల్గొన్నారు.

### నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ...

## పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి వినతిపత్రంఇచ్చిన గిరిజన సంఘం నాయకులు



అనంతగిరి : మండలంలో గల నాన్ షెడ్యూల్డ్ ఏరియా రొంపల్లి. ఎన్. ఆర్.పురం. గరుగుబిల్లి. గుమ్మకోట. భీం పోలు, ఈ 5 పంచాయతీల సమస్యలు పరిష్కారం చేయాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ సలీజనులను కలవడం జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసిపెంట. అప్పలనర్సయ్య మాట్లాడుతూ చిలకలగెడ్డ పంచాయతీ దాసరితోట నుండి పసిని మీదుగా రాభ నుండి రొంపల్లి పంచాయతీ వరకు 20 కిలోమీటర్ల రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ గోస్తని నది గెడ్డ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఇలా రోడ్డు నిర్మాణం ఏర్పడితే మండల కేంద్రానికి 40 కిలోమీటర్ల దూరం అదే రొంపల్లి నుండి మెంటాడ గజపతినగరం మండలాల మీదుగా వచ్చినట్లు అయితే 120 కిలోమీటర్లు దూరం ఉంటుంది అందుకే చిలకలగెడ్డ పంచాయతీ నుండి రొంపల్లి పంచాయతీ వరకు రోడ్డు నిర్మించాలని. ఎన్. ఆర్. పురం పంచాయతీ బొడ్డవలస నుండి చిమ్మిడివలస. రాయిపాడు బొంగిజ వరకు 8 కిలోమీటర్లు రోడ్డు సౌకర్యం కల్పించాలని. గుమ్మకోట పంచాయతీ గుమ్మకోట నుండి సంకుపర్తి వరకు ఓంశాఖ నిధులతో కేటాయించిన రోడ్డు నిర్మాణం చేపట్టాలని పి ఒ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అలాగే ఎన్. ఆర్. పురం పంచాయతీలో గిరిజనులు సాగు చేసుకుంటున్న బంజరు భూములను పట్టాలు ఇవ్వాలని కోరడంతో లబ్ధిదారులు వెంటనే దరఖాస్తులు చేసుకొండి 30 రోజుల్లో పట్టా పాసు పుస్తకాలు ఇచ్చేలా చర్యలు తీసుకోంటామని హామీ ఇవ్వడం జరిగిందని. రొంపల్లి పంచాయతీ ఫారెస్టు పోడు భూములకు దరఖాస్తు చేసిన ప్రతి ఒక్క లబ్ధిదారులకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు ఈకార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు జ్యేష్ఠ. వెంకట రమణ. కార్యదర్శి ఎస్. కొండలరావు రొంపల్లి పంచాయతీ మాజీ. %వీజో%ె% సభ్యులు నేగల. గంగులు (స్యాంసన్) ఎన్. ఆర్. పురం పంచాయతీ కోటపర్తి. పోలయ్య పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పట్ల యువత అవగాహన కలిగి ఉండాలి



ములగాడ : యువత ఎయిడ్స్ పట్ల అవగాహ న కల్గి ఉండాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారిణి ఇ.పి.యస్. బాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెంట్ ఆన్స్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఎయిడ్స్ ప్రపంచ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య వక్త గా పాల్గొని ప్రసంగిస్తూ.. ఎయిడ్స్ వ్యాధి 15 నుండి 29 సం॥రాల లోపు వయస్సు గల యువతరం లోనే ఎక్కువగా వస్తోందని, గత35 సం॥రా లుగా దీనికి ఎటువంటి వాక్సిన్ ను కనుగొన లేకపోయారని, అందు వల్ల అవగాన ఒక్కటే ఆయుధమన్నారు. ఇది 92శాతం సురక్షితం కాని లైంగిక సంబంధాల వల్ల వస్తోందని,లైంగిక జీవితం లోకి వెళ్ళ బోతున్న యువత ముందుగానే సురక్షిత విధానాలను తెలుసుకోవాలని అన్నారు. ఎయిడ్స్ కు సంబంధించినంత వరకు 'మాటే మందు అని, 'చైతన్యమే చికిత్స' అని ఆమె అన్నారు. సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్న జాతీయ సేవా పథకం యూనిట్-2 అధికారిణి వై. అనసూయ దేవి మాట్లాడుతూ - ప్రతి ఒక్కరు బ్లడ్ అవసరం అయినప్పుడు బ్లడ్ బ్యాంకుల నుండి మాత్రమే రక్తాన్ని స్వీకరించాలని, డిస్పోజ యిల్ సిరంజులు, సూదులను వాడాలని, ప్రతి ప్రసవం హాస్పటల్ లో డాక్టర్ల పర్యవేక్షణ లో జరిగేలా చూడాలని, సురక్షిత లైంగిక సంబంధాల కోసం ఆత్మ నిగ్రహంతో, క్రమశిక్షణతో జీవించాలన్నారు. అనం తరం వివాహానికి ముందు లైంగిక సంబంధాల జోలికి వెళ్ళమని, వివాహానంతరం భర్య, భర్తలు ఒకరికొకరు కట్టుబడి ఉంటామని, ఎలుడ్స్ నివారణకు కృషి చేస్తామని, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులను ఆదరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో కళాశాల ప్రతినిధి, యూత్ వలంటీర్లు, పీర్ లీడర్లు, జాతీయ సేవా పథక వలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ విజేతలకు బహుమతులను అందజేశారు.

### సత్యదేవుని సన్నిధిలో నిర్వహించు 'కోటి తులసి' పూజ కు

# శ్రీశ్రీశ్రీ స్వరూపానంద సరస్వతికి ఆహ్వానం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నందు లోక కళ్యానార్థము రాష్ట్ర మంతయు సస్య శ్యామలంగా ఉండుటకు గాను ది.16.12.2020 వ తేది నుండి ది.25.12. 2020 వరకు నిర్వహించు "కోటి తులసి పూజ" కు రావలసిందిగా శ్రీశ్రీశ్రీ స్వరూపానంద సరస్వతి స్వామి వారిని ఆహ్వానించుటకు మంగళవారం దేవస్థానం చైర్మన్ ఐవి రోహిత్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి వేంద్ర. త్రినాధ రావు మరియు ధర్మకర్తల మండలి సభ్యులు గాదె. రాజశేఖర్ రెడ్డి,మోకా. సూర్య నారాయణ, చాగంటి. వెంకట సూర్యనారాయణ, వాసిరెడ్డి. జగన్నాధం, బదిరెడ్డి. గోవిందు తదితరులు పాల్గొని స్వయంగా ఆహ్వానించారు.

# ఎయిడ్స్ పై అవగాహనా ర్యాలీ




విశాఖసిటీ : ఎస్‌వివిపి విఎంసి డిగ్రీ కళాశాల ఎంవీపీ కాలనీలో మంగళవారం 'ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం' సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సిసి మరియు రెడ్ రిబ్బన్ వారి ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.జగదీశ్వరరావు అధ్యక్షతన 'ర్యాలీ'ని ప్రారంభించారు. ర్యాలీ కళాశాల నుండి ఎంవీపీ సర్కిల్ వరకు 'ఎయిడ్స్‌ని నివారిద్దాం', 'ఎయిడ్స్ అంటువ్యాధి కాదు-అంటించుకునే వ్యాధి' వంటి నినాదాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్తలు-డా.పి.అప్పారావు, ఎన్.రాజశేఖర్, ఎన్‌సిసి లెఫ్టినెంట్ ఎస్.ఉషాకుమారి, కళాశాల రెడ్ రిబ్బన్ సమన్వయ కర్త-ఎన్.రాణీ ప్రియాంక మరియు ఉపాధ్యాయులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈ నెల 4న వ్యాన్ల లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు

## నాతవరం ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

నాతవరం : ఇంటింటికి రేషన్ బియ్యం తరలించేందుకు వ్యాన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 4న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని నాతవరం ఎంపిడిఒ ఎల్.యాదగిరీశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాన్ల కోసం 163 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిలో 8 బిసికి, 3 ఎస్సీలకు, 2 ఎస్టీలకు, 2 ఇతరులకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థుల జాబితాను మరుసటి రోజు 5వ తేదీన ప్రకటిస్తామన్నారు.

## సరైన అప్రమత్తతో

# కర్మాగారాల్లో జరిగే ప్రమాదాలను నివారించవచ్చు

### జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ జె.శివశంకర్‌రెడ్డి



భీమునిపట్నం : సరైన అప్రమత్త తో కర్మా గారాల్లో జరిగే ప్రమాదాలను నివారించ వచ్చని విశాఖ జాయింట్ చీఫ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీ స్ జె శివ శంకర్ రెడ్డి అన్నారు.భీమిలీ మండలం చిప్పా డ దివిస్ యాజమాన్యం నిర్వ హిస్తున్న మాక్ డ్రిల్ లో ఆయన పాల్గొని మాట్లాడుతూ కర్మాగారాల్లో ప్రమాదాలు సంబవించడానికి అవకాశం ఉన్న ప్రదేశాలను రసాయలను గుర్తించి వాటి నివారణ కు భద్రత కు తీసు కోవాల్సిన చర్యల పై నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. దివిస్ లో అన్ సైట్ ఏమర్జన్సీ టీమ్ ద్వారా తీసుకుంటున్న చర్యలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.స్థానిక పరిశ్రమల లో భద్రతా ప్రమాణాలు కర్మాగారంలో భద్రత పై యాజమాన్యం అవగాహన భద్రత పై కార్మికుల్లో ఉన్న అవగహన అభినందనియమని అన్నారు. ప్రతీ కర్మాగారం నిర్దిష్ట కాల వ్యవధి లో మాక్ డ్రిల్ లను నిర్వహించడం ద్వారా భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఒక వేళ ప్రమాదం సంభవిస్తే వాటిని అరికట్టేందుకు సత్వర చర్యలు తీసుకునేందుకు కావాల్సిన విషయాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్మగా రాల శాఖ కు చెందిన ఇతర అధికారులు దివిస్ కర్మాగార జనరల్ మేనేజర్లు ఎల్ వి రమణ ,ఎస్ దేవేందర్ రావు, కె . సుబ్బారావు భద్రత అధికారి ఎం.చంద్ర శేఖర్. తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల పరిరక్షణ

# హిందువుల భాద్యత



గాజువాక: దేవాలయాల పరిరక్షణ హిందువుల భాద్యతని, ప్రతి ఒక్క హిందువు దేవాలయాల రక్షణలో భాగస్వాములు కావని గాజువాక నియోజకవర్గ జనసేన కన్వీనర్ కోన తాతారావు అన్నారు. ఆగనంపూడి దానబోయినపాలెం కాలనీ లో నూతన ధ్వజస్థంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో జనసేన పార్టీ పీఏసీ సభ్యులు, గాజువాక నియోజకవర్గం ఇంచార్జ్ కోన తాతారావు, జివిఎమ్సి 85వ వార్డు జనసేన నాయకులు గవర సోమశేఖర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ తరుపున గవర సోమశేఖర్ రావు ఆలయ అభివృద్ధి కోసం రూ.30,000/- (ముప్పై వేల రూపాయలు) కోన తాతారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గొన్న తాతారావు, లక్కరాజు అప్పలరాజు, లక్కరాజు సన్యాసిరావు, విందుల చిరు రాజు, పి వశంత్ కుమార్, బుదిరెడి అప్పారావు, పెద్ది రెడ్ల భాస్కర్, కుర్మాపురవి. దుల్ల ఈశ్వర్ రావు, ఋల్లేటి తాతారావు, లక్కరాజు రమణ, సలాది రాము. దానబాల అర్జున్, అమరపిన్ని త్రినాధ రావు గ్రామ పెద్దలు, ఇతర జనసైనికులు పాల్గొన్నారు.

# దేశ ప్రగతిలో నార్ల సేవలు చిరస్మరణీయం

### వీజేఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు



విశాఖపట్నం : దేశ ప్రగతిలో సమాజం కోసం రాజ్యసభ సభ్యుడిగా ప్రముఖ పాత్రికేయుడు నార్ల వెంకటేశ్వరరావు అందించిన సేవలు చిరస్మరణీయమని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవీవీ సత్యనారాయణ కొనియాడారు. వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం ఇక్కడ విజేఎఫ్ వినోద వేదికలో నిర్వహించిన నార్ల వెంకటేశ్వరరావు అందించిన సేవలు అభినందనీయం అన్నారు. నాటి తరం పాత్రికేయుడుగా మంచి రచయితగా నేటితరం జర్నలిస్టులకు ఆదర్శంగా నిలిచిన ఘనత నార్ల వెంకటేశ్వరరావు కి దక్కిందన్నారు. స్పెషల్ బ్రాంచ్ ఏసీపి గోవిందరావు మాట్లాడుతూ నార్ల వెంకటేశ్వరరావు మంచి కథా రచయితతో పాటు అనేక రంగాల్లో తన ప్రతిభను చూపించేవారన్నారు. మంచి, చెడులను సమానంగా బేరీజు వేసి అందులో లోటుపాట్లు ఎత్తి చూపిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మానవతివాదిగా నార్ల ఎంతో మంది మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఈపిడిసిఎల్ డైరెక్టర్ రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ నార్ల జయంతి వేడుకల్లో పాల్గోనడం ఆనందంగా వుందన్నారు. వారి కుటుంబానికి చెందిన నార్ల తాతారావు విద్యుత్ రంగంలో అనేక సంస్కరణలు ఆమలు చేసి గొప్ప ఘనత సాధించారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ పాత్రికేయుడుగా నార్ల వెంకటేశ్వరరావు సాధించిన ఘనత భవిష్యత్ తరాలకు ఆదర్శనీయంగా నిలిచిందన్నారు. నార్ల పేరిట వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ఒక ప్రెస్ క్లబ్ భవనానికి పేరు పెట్టడం అభినందనీయం అన్నారు. చట్ట, సభలకు వన్నె తెచ్చిన ఘనత నార్లకే దక్కిందన్నారు. ఆయన స్ఫూర్తితో ఎన్నో కార్యక్రమాలు విజేఎఫ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. విజేఎఫ్ కార్యదర్శి ఎస్ దుర్గారావు మాట్లాడుతూ నార్ల జయంతి , వర్ధంతి వేడుకలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. సభ్యులు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. తొలుత నార్ల చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఫోరం ఉపాధ్యక్షులు ఆర్ నాగరాజు పట్నాయక్ స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నానాజీ, జాయింట్ సెక్రటరీ దాడి రవికుమార్, కోశాధికారి పిఎన్ మూర్తి, కార్యవర్గం సభ్యులు ఇరోతి ఈశ్వరరావు, పైల దివాకర్, ఎంఎస్ఆర్ ప్రసాద్, ఎస్ మాధవరావు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పూడిమడకలో ఫిషింగ్ హార్బర్

# స్థలాన్ని పరిశీలించిన జేసి





అచ్యుతాపురం : మండలంలో పూడిమడకలో త్వరలో నిర్మించబోయే ఫిషింగ్ హార్బర్ స్థలాన్ని జాయింట్ కలెక్టర్ ఎమ్ వేణుగోపాల్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. దీనికి సంబంధించిన స్థలాల కొలతలను, సర్వే మ్యాప్ ను ఆయన పరిశీలించారు. జేసితో పాటు ఫిషరీస్ జేడి ఫణి ప్రకాష్ ఉన్నారు. ఈ కార్య క్రమంలో మండల రెవిన్యూ అధికారులు, ఫిషరీస్ అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# జోగుంపేట నుండి మర్రిపాలెం బిటి రోడ్డు ప్రారంభోత్సవం

గొలుగొండ : జోగుంపేట జంక్షన్ నుండి కొయ్యూరు మండలం మర్రిపాలెం వరకు బిటి రోడ్డు నిర్మాణాన్ని మంగళవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం కృషి చేసిన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, అరకు ఎంపి గొడ్డేటి మాధవికి, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోగొలుగొండ మండల వ్యవసాయ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ లెక్కల సత్య నారాయణ, పాతమల్లంపేట మాజీ సర్పంచ్ వి.రమణ, పిఎస్ టివి.రమణ, వీఆర్వో కె.అప్పారావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

# 61వ వార్డ్ తెదేపా అధ్యక్షుడుగా మజ్జి సోమేష్



గాజువాక: జీవీఎంసీ 61వ వార్డ్ తేదేపా అధ్యక్షుడు గా ప్రముఖ పారిశ్రామిక వేత్త, నిగర్వి, నిస్వార్థపరుడు సీనియర్ తేదేపా నాయకులు మజ్జి సోమేష్ ను వార్డ్ తేదేపా శ్రేణులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం తేదేపా ఎన్నికల పరిశీలకులు పొలిమేర సీతారాం సమక్షంలో నిర్వహించిన ఎన్నికలలో మజ్జి సోమేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సీతారాం తెలిపారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ తెదేపా బలోపేతానికి కృషి చేయాలని,రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కార్పొరేటర్ల విజయానికి కృషి చేయాలని కోరారు. వార్డ్ అధ్యక్షుడు గా ఎన్నికైన మజ్జి సోమేశ్ మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న పార్టీ శ్రేణులకు, పశ్చిమ టీడీపీ ఎమ్మెల్యే పి. గణబాబు కు,సీనియర్ నాయకులకు కృతజ్ఞతలను తెలిపారు. పార్టీ బలోపేతానికి, అభ్యర్థుల గెలుపుకు కష్టబడి పనిచేస్తానని,నాపై ఉంచిన నమ్మకానికి అన్నివిధాలుగా పార్టీ కి ఉంటానని అన్నారు. మజ్జి సోమేష్ ఎన్నిక పట్ల వార్డ్ తెదేపా అభ్యర్థి, శ్రీలక్ష్మి, సీనియర్ నాయకులు కాకి పొలిరెడ్డి,ఉరుకూటి నర్సింగరావు, ఆర్మీ శ్రీను, సర్వసిద్ది శ్రీను కార్యకర్తలు తదితరులు అభినందనలు తెలియజేశారు.

# ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ

గొలుగొండ : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సంద ర్భంగా మంగళవారం గొలుగొండ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గొలుగొండ పిహెచ్‌సి నుంచి ఆశా కార్య కర్తలు ర్యాలీగా జోగంపేట వరకు ఎయిడ్స్‌ను ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




## పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్ఐఎన్ఎల్ కృషి




గాజువాక: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కార్పొరేట్ సంస్థ, రాష్ట్రీయ ఇస్పాట్ నిగమ్ లిమిటెడ్ కొన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ రెస్పాన్సిబిలిటీ (సిఇఆర్) కింద రూ .91 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిజేసింది. డిఎవి స్కూల్, ఉక్కునగరం, విశాఖ విమల విద్యాలయ, ఉక్కునగరం, విశాఖ విమల విద్యాలయ బిసి రోడ్ లలో గల పాఠశాలలకు ఈ అవకాశం దక్కింది. పైన పేర్కొన్న మూడు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ (పర్సనల్) కిషోర్ చంద్ర దాస్ సోమవారం శంకుస్థాపన చేశారు.

సౌర విద్యుత్ సరఫరా...: పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించే ప్రయత్నంలో భాగంగా, ఆర్ ఐ ఎన్ ఎల్ విశాఖ విమల విద్యాలయ స్కూల్ బిసి రోడ్ వద్ద ఆంధ్రప్రదేశ్ యొక్క న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్ఇడిసిఎపి) ద్వారా 25 కిలోవాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేయడానికి సిఇఆర్ బడ్జెట్ నుండి 11.97 లక్షలు కేటాయించారు. సోమవారం విశాఖ విమల విద్యాలయ బిసి రోడ్‌లో సౌర విద్యుత్ ప్రాజెక్టును ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ (పర్సనల్) కిషోర్ చంద్ర దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.సి దాస్ తనమాట్లాడుతూ పాఠశాల లోపల, వెలుపల విద్యార్థులలో క్రమశిక్షణను మెరుగుపరచడంలో ఉపాధ్యాయులు మెరుగైన పాత్రను పోషించాలని కోరారు. పాఠశాలలకు అనుకున్న మౌలిక సదుపాయాలను సక్రమంగా నిర్వహించాలని, ఉక్కునగరంలోని పాఠశాలల మధ్య సహకారం మరియు ప్రస్తుత పరిస్థితులలో అభివృద్ధి చెందడానికి ఉత్తమమైన పద్ధతులను అవలంబించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎపిఎస్ఎస్ఎ, ఎపి ప్రభుత్వం, ఎఫ్ కె లక్రా, సిజిఎం (టౌన్ అడ్మిన్), ఆర్ఐఎన్ఎల్, వివివి స్కూల్ ప్రతినిధులు, ఇతర సీనియర్ అధికారులు, డిఎవి పాఠశాల ఉక్కునగరం,వివివి పాఠశాల, ఉక్కునగరం సిబ్బంది, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

# సామాజిక తనిఖీ ప్రజావేదిక



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కొయ్యూరు : కొయ్యూరు మండల కేంద్రంలో మండల పరిషత్ ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 33 పంచాయతీల వీఆర్వీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పలు శాఖల అధికారులు ప్రజా వేదికకు హాజరయ్యారు. ముఖ్య అతిధిగా హాజరైన ఐటిడిఎ ఎడిషనల్ పిడి రాధాకృష్ణ మాట్లాడుతూ 1.04.2019 నుండి 31.03.2020 వరకు జరిగిన పనులపై సోషల్ ఆడిట్ జరిగిందన్నారు. 13 రోజులుగా సిబ్బంది గ్రామాల్లో తిరిగి అక్కడ జరిగిన పనుల కొలతలు గుర్తించి గ్రామాల్లో గ్రామ వేదిక నిర్వహించాలన్నారు. అనంతరం ప్రజావేదికలో ఏడు శాలకు సంబంధించిన 69లక్షల 50వేల 947ల గుర్తించడం జరిగిందన్నారు. 15 రోజుల్లో జరిగిన పనుల్లో ఏమైనా ఆధారాలు ఉంటే డుమా పిడి కార్యాలయానికి వెళ్లాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ డివిజనల్ విజిలెన్స్ అధికారి చంద్రకళ, చింతపల్లి క్లస్టర్ ఏపిడి రవీంధ్ర, సోషల్ ఆడిట్ ఇంటర్నల్ మోనటరింగ్ టీం దాసు, కొయ్యూరు ఎంపిడిఒ మేరీరోజ్, ఏపిఒ రాజు పాల్గొన్నారు.

# డిసెంబరు 4 డీసీఐ పరిరక్షణ దినం 'పోస్టర్ విడుదల'




విశాఖపట్నం : సిఐటియు నగర ఆఫీస్‌లో మంగళవారం 'డిసిఐ పరిరక్షణ పోస్టర్'ను సిఐటియు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.కె.ఎస్.వి. కుమార్, ఎం. జగ్గునాయుడు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో-కన్వీనర్ కె.ఎం. కుమార్ మంగళం, నగర ఉపాధ్యాక్షులు పి. వెంకటరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి జగ్గునాయుడు మాట్లాడుతూ విశాఖపట్నంలో ఉన్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డి.సి.ఐ) కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ. 2017లో బిజెపి మోడీ ప్రభుత్వం డిసిఐని ప్రైవేటుకు అమ్మాలని నిర్ణయం చేసింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు పోరాటానికి పిలుపు నిచ్చింది. డిసిఐ ఉద్యోగులు 2017 నవంబర్ -22 నుండి 5 జనవరి 2018వరకు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేసారు. డిసిఐ ప్రైవేటీకరణకు మనస్తాపం చెంది 2017 డిసెంబర్ 4న డిసిఐ ఉద్యోగి ఎన్.వెంకటేష్ రైలు కిందపడి సూసైడ్ చేసుకున్నారు. తన యొక్క మరణ వాంగ్మూలంలో డిసిఐ ప్రైవేటీకరణ చేయకూడదని ప్రభుత్వరంగంలోనే కొనసాగాలని కోరుతూ లేఖ రాసారు. ఈయన మరణంతో పోరాటం మరింత ఉదృతంగా సాగింది. విశాఖలో ఉన్న అన్ని ప్రభుత్వ రంగసంస్థల ఉద్యోగులు డిసిఐ పోరాటానికి అండగా నిలిచారు. ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేసారు. సిఐటియు లక్షలాది కరపత్రాలు ముద్రించి తమ సంఘ సభ్యులతో నగర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఇంటింటికి ప్రచారం జరిగింది. డిసిఐ ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని ప్రజలను కోరింది. నగరంలో ప్రజల మద్దతు కూడకట్టడానికి బ్యాలెట్ నిర్వహించింది. ఒక్కరోజులోనే లక్షమంది ప్రజలు తమ యొక్క బ్యాలెట్ ద్వారా డిసిఐ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఓటు వేసారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల ఒత్తిడికి తలొగ్గి డిసిఐని ప్రైవేట్‌పరం చేయకుండా తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది అన్నారు. ఇప్పుడు 4 పోర్టులు పారదీప్‌పోర్టు, విశాఖపోర్టు, జవర్‌లాల్‌నెహ్రూ పోర్టు, కాండ్లాపోర్టులు కలిసి కన్సార్టియంగా ఏర్పడి డిసిఐని ప్రభుత్వరంగ పరిశ్రమగా కొనసాగిస్తున్నవి. డిసిఐ ప్రయివేటీకరణ వ్యతిరేక పోరాటంలో బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయి. పార్లమెంట్‌లో బిజెపి ప్రభుత్వాన్ని నిలదీశాయి. డిసిఐని ఎటువంటి పరిస్థితిల్లోనూ ప్రయివేటీకరణ చేయకూడదని డిమాండ్ చేశాయి. సంస్కరణలు అత్యంత స్పీడుగా అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలను నిలువరిం చాలంటే కార్మిక వర్గ ఐక్యత అత్యంత అవసరం. డిసిఐ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం విశాఖ కార్మిక వర్గానికి ఒక ఆదర్శం. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి నరేంద్రమోడీ ప్రభుత్వం ఎన్నికల్లో మతం రంగుని, నేడు కరోనా ముసుగులో అత్యంత దూకుడుగా ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీ కరణకు పూను కున్నది. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పోస్కోకి అప్ప చెప్పాలని చూస్తున్నది. భారతదేశంలో ఉన్న పోర్టులు అన్నింటినీ కూడా కార్పొరేట్ చేయాలని మేజర్‌పోర్టు అధారిటీబిల్లును పార్లమెంట్‌లో పాస్ చేసుకుంది. రైల్వేలను ప్రైవేటీకరణ చేస్తున్నది. 32లక్షల కోట్లు ఆస్తులు ఉన్న ఎల్.ఐ.సిని ఐపిఓ పేరుతో ప్రయివేటుపరం చేసే ప్రయత్నాలు చేస్తున్నది. ఇప్పటికే 23 ప్రయివేట్ బీమా కంపెనీలతో పోటీపడుతూ ఎల్ఐసి అద్భుతమైన ప్రగతి సాధించింది. గత 6సం॥ర కాలంలో నరేంద్రమోడీ అధికారంలో ఉన్నంత కాలం ఒక్క ప్రభుత్వరంగ పరిశ్రమను స్థాపించలేదు. ప్రభుత్వరంగ బ్యాంకులను బలహీనపరచి ప్రైవేట్, కార్పొరేట్ బ్యాంకులను ఆహ్వానిస్తున్నారు. దేశరక్షణకు వెన్నుముక లాంటి రక్షణ రంగాన్ని ప్రైవేట్‌పరం చేసి బహూళజాతి సంస్థలకు అప్పజెప్పచెప్పాలని ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే నవరత్నాల బిహెచ్ఇఎల్ పరిశ్రమ మోడీ అధికారం వచ్చిననాటినుండి నష్టాలో నడుస్తున్నది. ఓఎన్‌జిసిని అప్పుల్లో కూరుకుపోయేలాచేసింది. స్టీలుప్లాంట్‌కు సొంత గనులు కేటాయించక ఉత్పత్తి వ్యయం పెరిగి, మార్కెట్ తగ్గి నష్టాలు చవిచూస్తున్నది. బొగ్గు గనులు అమ్మివేయాలని పథకం రచించింది. ఆయిల్ సెక్టార్, టెలికాం రంగాన్ని రిలియన్స్ అంబానికి అప్పజెప్పాలనీ, రైల్వేలు, పోర్టులు, ఆధానికి అప్పజెప్పాలని మోడీ ప్రభుత్వం చేస్తున్న పని. ఈ విధనాలకు వ్యతిరేకంగా నవంబరు 26 దేశ వ్యాప్తంగా కార్మికులు 25కోట్ల మంది సమ్మెచేసారు. ప్రభుత్వరంగ రక్షణకు మన ఆందోళన కొనసాగించాలి. ప్రజలను మిగతా కార్మిక వర్గాన్ని దీనిలో భాగస్వాములను చేయాలి. నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక ప్రభుత్వం. ఈ ప్రభుత్వ విధానాలను కార్మికులం పోరాటాలు ద్వారానే తిప్పికొట్టగలం.

విశాఖ ప్రభుత్వరంగం రక్షించబడాలంటే పోరాటమే మార్గం. డిసిఐ మనకు మార్గదర్శకం. 2017 జరిగిన డిసిఐ పోరాట విజయాలను మననం చేసుకోవాలి. భవిష్యత్ పోరాటాలకు ఆదర్శంగా నిలవాలి. కా॥ ఎన్.వెంకటేష్‌కు నివాళులు అర్పిద్దాం. ఆశయాలు కొనసాగిద్దాం.. డిసిఐ పరిరక్షణ దినం సందర్భంగా డిసెంబరు 4న మధ్యాహ్నం 3.30గం॥లకు సీతమ్మధార అల్లూరి విగ్రహం నుండి డిసిఐ ఆఫీస్‌వరకు జరిగే ప్రదర్శన అనంతరం జరిగే సభలో ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేత



గాజువాక : జీవియంసి 65వ వార్డు సంజీవి గిరి కాలనీలో కావటి పద్మజ అనే మహిళ కుటుంబంతో నివాసం ఉంటుంది. అనుకోని పరిస్థితిలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో రేకుల షెడ్ దగ్ధం అయ్యింది. ఒక్కసారిగా మంటలు రావడంతో ఇంట్లో నుంచి బయటకి పరుగులు తీశారు. ఇంట్లో ఉన్న సామాన్లు పూర్తిగా కాలి పోయాయి. సమాచారం తెలుసుకొన్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి 65 వార్డు వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థి బొడ్డు నర్సింహాపాత్రుడు ఆదేశాలు మేరకు జిల్లా వైసీపీ కార్యదర్శి ఇరోతి గణేష్ తక్షణమే స్పందించి బాధితులకు అండగా నిలిచి నిత్యవసర సరుకులు అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలా సహాయ పడతాను అని బాధితులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వార్డు బూత్ కమిటీ సభ్యులు అనిల్, విఘ్నేష్, బొబ్బిలి భాస్కర్, శ్రీను, జోగరావు, కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## 33వవార్డులో పెన్షన్ పంపిణీ



విశాఖపట్నం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యం తో ముఖ్య మంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి గారు అందచేస్తున్న పేదలందరికీ పెన్షన్ కానుక లో భాగంలో 33వార్డ్ పేదలకు, దివ్యంగులకు సెక్రటరీలు, వాలంటీర్స్ పెన్షన్ పంపిణీ చేశారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమం లో వార్డ్ వైస్సార్సీపీ ప్రెసిడెంట్ రంధి గోపికృష్ణ, వార్డ్ సెక్రటరీలు పి వి కిరణ్ కుమార్, జాన్ బాబు, వాలంటీర్ కనక పాల్గొన్నారు తమ ఇంటికి పెన్షన్ అందించిన సచివాలయ సిబ్బంది కి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియచేసుకున్నారు.

## మైదానంలో పెరిగిన మంచు

మాకవరపాలెం : మైదానంలో మంచు తీవ్రత పెరిగింది. మాకవరపాలెం మండలంలో మంచు పెరగడంతో మండల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటల వరకు మంచు తెరలు వీడకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వస్తుంది. ఉదయం పూట పనులకు వెళ్లే కూలీలు మంచుతో అవస్థలు పడుతున్నారు. వృధ్దులు, చిన్నపిల్లల ఇబ్బందులు వర్ణణాతీతం.

## ట్రక్కుల కోసం 139 దరఖాస్తులు

### ఎంపిడిఓ మేరీరోజ్

కొయ్యూరు : మండలంలో రేషన్ సరుకులు తరలించేందుకు అవసరమైన ట్రక్కుల కోసం 139 మంది దరఖాస్తు చేసినట్టు ఎంపిడిఓ మేరీరోజ్ తెలిపారు. వీరిలో 16 మందిని ఎంపిక చేయనున్నట్టు చెప్పారు. 11 మంది ఎస్సీ, అభ్యర్థులు, ముగ్గురు బిసి, ఒక ఎస్సీ, ఒక ఈబిసి అభ్యర్థులకు వీటిని మంజూరు చేయనున్నట్లు తెలిపరు. 4వ తేదీన ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు చెప్పారు.


# చింతపల్లిలో "సంకల్పం" కార్యక్రమము



విశాఖపట్నం రూరల్ ( చింతపల్లి ): విశాఖపట్నం జిల్లా ఎస్.పి., బి. కృష్ణారావు ఐ.పి.ఎస్, వై.టి.సి., చింతపల్లిలో, చింతపల్లి సబ్ డివిజన్ పోలీసులు ప్రారంభించిన "సంకల్పం" కార్యక్రమం విద్యార్థులను సందర్శించారు. జిల్లా ఎస్.పి మాట్లాడుతూ విద్య మరియు నైపుణ్యం అభివృద్ధి యొక్క ప్రాముఖ్యత గురించి మాట్లాడారు మరియు విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి పనిచేయడం విజయానికి కీలకమని, సత్వరమార్గాలు లేవని ఆయన నొక్కి చెప్పారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడానికి పోలీసులకు ప్రధాన ప్రేరణ గిరిజన విద్యార్థుల సంక్షేమం మరియు వారి విజయం అని ఓఎస్డి నర్సిపట్నం సతీష్ కుమార్ ఐపిఎస్ అన్నారు. ఎ.ఎస్.పి., చింతపల్లి విద్యా సాగర్ నాయుడు ఐపిఎస్ మాట్లాడుతూ విద్యార్థులు దేనికైనా ఎప్పుడైనా పోలీసులను సంప్రదించవచ్చు, అని అన్నారు అలాగే ఈ కార్యక్రమము మొత్తం 120 రోజులు ఉంటుందని, హాజరైన విద్యార్థులకు కంప్యూటర్, ఇంగ్లిష్ స్పీకింగ్, వ్యతిగత వికాసం మొదలైన వాటిపై శిక్షణ ఇస్తారు. ఈ మొత్తం కార్యక్రమం జిల్లా ఐ.టి.డి.ఎ., వారి సహకారం తో నిర్వహిస్తున్నట్లు ఏ.ఎస్.పి. తెలియజేశారు. "సంకల్పం" ప్రారంభించడానికి ప్రేరణ ఏమిటంటే, డ్రాపౌట్‌లను జాగ్రత్తగా చూసుకోవడం మరియు వారికి గౌరవప్రదమైన కెరీర్ అవకాశాలను నిర్ధారించడం మరియు వారిని మంచి వ్యక్తులుగా మార్చడం తద్వారా ఉద్యోగ ఉపాధి పొందేందుకు మార్గం ఏర్పడుతుందని అన్నారు. అదనపు ఎస్పీ సిఆర్‌పిఎఫ్ అరుముగం, సిఐ వెంకట్ రావు, సిఐ చింతపల్లి శ్రీను, ఎస్ఐ అన్నవరం ప్రశాంత్ పాల్గొన్నారు.

**మావోయిస్టు ప్రభావిత ప్రాంతం రాళ్లగెడ్డ సాయుధ అవుట్ పోస్టును సంధర్శించిన జిల్లా ఎస్.పి.,**

విశాఖ జిల్లా ఎస్‌పీ బి కృష్ణరావు ఐపిఎస్, ఓఎస్డి నర్సిపట్నం ఎస్.సతీష్ కుమార్ ఐపిఎస్ , చింతపల్లి ఏఎస్‌పీ విద్యాసాగరనాయుడు లు మంగళవారం మావోయిస్టు ప్రభావిత ప్రాంతం రాళ్లగెడ్డ సాయుధ అవుట్ పోస్టును తనిఖీచేశారు. ముందుగా చింతపల్లి, అన్నవారం పోలీసుస్టేషన్‌లను తనిఖీచేశారు. అనంతరం రాళ్లగెడ్డకు చేరుకుని తనిఖీలు నిర్వహించారు. బుధవారం నుంచి మావోయిస్టు పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో మావోయిస్టు ప్రభావిత చింతపల్లి సబ్‌డివిజన్ భద్రతా పరిస్థితిని సమీక్షించారు. ఎస్పీ సబ్ డివిజన్ సిబ్బందితో పరిస్థితులపై చర్చించారు. మరియు రాబోయే రోజుల్లో మావోయిస్టులు నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి పోలీసు సిబ్బందితో చర్చించారు. మన్యంలో పరిస్థితి గరించి చింతపల్లి ఏఎస్‌పీ విద్యాసాగరనాయుడు ను అడిగి తెలుసుకున్నారు. మన్యంలో భద్రోత గురుంచి తీసుకున్న చర్యలు, భద్రతా ఏర్పాట్లుతో పాటు ఏవోపీలో తీసుకుంటున్న చర్యలు గురించి ఏఎస్‌పీ వివరించారు. ఏవోపీ ల పర్యవేక్షణ కోసం తీసుకువచ్చిన కొత్త డ్రోన్‌లను ఎస్పీ పరీక్షించి, వాటి పనితీరును గమనించారు. అసిస్టెంట్ కమాండెంట్లు సి.ఆర్.పి.ఎఫ్. దేవేంద్ర నాయుడు, కుల్దీప్ హాజరయ్యారు. చింతపల్లి సీఐ శ్రీను, సిఐ ఏ.వెంకట్రావు, ఎస్ఐ అన్నవరం ప్రశాంత్ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ




రాజమహేంద్రవరం : ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం లో బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆద్వర్యంలో ప్రజలందరికీ ఎయిడ్స్ పై అవగాహన కల్పించుకోవాలని ప్ల కార్డులతో స్ధానిక గోరక్షణపేట నందు ఉన్న రాష్ట్ర అసోసియేషన్ కార్యాలయం నుండి ఆర్.టి.సి కాంప్లెక్స్ వరకు ర్యాలీ ని నిర్వహించారు.ఈ సందర్భంగా బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వి.కృష్ణారావు మాట్లాడుతూ ఎయిడ్స్ ను పూర్తి స్ధాయిలో నిరోధించాలని.ఎయిడ్స్ రోగుల పట్ల మానవతా దృక్పధం తో వ్యవహరించాలని సూచించారు.అదేవిధంగా కరోనా వైరస్ పూర్తిగా నివారణ కాలేదని,కరోనా వైరస్ రెండవ దశలో ఉన్నందున గుంపులు గుంపులుగా మాస్కులు ధరించకుండా విచ్చలవిడిగా తిరగకుండా ప్రతీ ఒక్కరూ మాస్కులు ధరించి బౌధిక దూరం పాటించాలని తెలిపారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరికి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎయిడ్స్ గాలి ద్వారా వ్యాపించదని,ఒకరి నుండి ఒక్కరికి వ్యాపించదని,ఎయిడ్స్ అంటించుకునే వ్యాధి అని కావున ఎయిడ్స్ పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వై.యస్.యన్ మూర్తి,తిరుపతి రెడ్డి జిల్లా అధ్యక్షుడు అద్దంకి.సూర్య,ప్రదాన కార్యదర్శి యస్.మురళీధర్,ఎం.ఎం.జయరావు,డి.జె.రాజు,ఎన్.మోహన్ రావు,కె.వి.వి.సత్యనారాయణ,ఎ.నారాయణరావు,ఎన్.అశోక్ కుమార్, ఎన్.శ్రీధర్,పి.చిరంజీవి,బోస్,ప్రసాద్ కుమార్, రణధీర్, చిట్టిబాబు,రాజు,పి.సత్యనారాయణ,బి.రాజుతదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గంటా జన్మదిన వేడుకలు



భీమునిపట్నం : తెలుగుదేశం పార్టీ నేత, మాజీ మంత్రి, విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు భీమిలి పార్టీ కార్యాలయం లో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టిడిపి నాయకులు , కార్యకర్తలు మరియు అభిమానుల కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి, భీమిలి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ.1999లో తెలుగుదేశం పార్టీ నుండి రాజకీయ అరంగేట్రం చేసి రెండు దశాబ్దాలకు పైగా ఓటమి ఎరుగని నేతగా, పిలిస్తే పలికే నేతగా, గంటా శ్రీనివాసరావు రని అన్నారు.భీమిలి నియోజకవర్గంలో 30వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు తెచ్చి ప్రతీ గ్రామానికి సిసి రోడ్లు, కాలువలు, సామాజిక భవనాలు, సామాజిక మరుగుదొడ్లు పూర్తి చేయడమే కాకుండా, ప్రతీ స్కూల్ భవనాన్ని అదునాతనమైనదిగా తీర్చిదిద్ది, డిజిటల్ క్లాస్ రూమ్ లను పరిచయం చేశారని గంటా నూకరాజు అన్నారు. జిల్లా తెలుగు మహిళాఅధ్యక్షురాలు కురిమిన లీలా వతి మాట్లాడుతూ.. గంటా అంటే అభివృద్ధి, అభివృద్ధి అంటే గంటా అనే విధంగా పేరును సంపాదించిన వ్యక్తి గంటా శ్రీనివాసరావు రని అన్నారు. విజయం తప్ప అపజయం ఎరుగని నేత అని, మరలా గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లాలో తెలుగుదేశం పార్టీ పూర్వవైభవం వస్తుందని అన్నారు.మాజీ జెడ్.పి.టి.సి. కశిరెడ్డి దామోదరం మాట్లాడుతూ.గత ముప్పై సంవత్సరాలుగా చేయని అభివృద్ధి ఒక్క 5 సంవత్సరాల కాలంలో భీమిలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని, గంటా శ్రీనివాసరావు చేసిన అభివృద్ధికి రాష్ట్రంలో భీమిలి నియోజకవర్గంకి రాష్ట్రంలో ప్రత్యేకమైన గుర్తింపు వచ్చిందని అన్నారు. తగరపువలస డివిజన్ అధ్యక్షులు తమ్మిన సూరిబాబు మాట్లాడుతూ.భీమిలి నియోజకవర్గంలో గంటా శ్రీనివాసరావు ప్రవేశం తర్వాత ప్రతీ గ్రామం, పంచాయితీ, ప్రతీ వార్డు ఎంతో అభివృద్ధి చెందాయని అన్నారు.

మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చిలకా నర్సింగరావు మాట్లాడుతూ.. అభివృద్ధికి చిరు నామా అయిన గంటా వేసిన పునాది రేపు జరగబోయే స్థానిక సంస్థలు ఎన్నికలో విజయం సాధిస్తామని అన్నారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చురకల రమణ, భీమిలి డివిజన్ బి.సి.సెల్ అధ్యక్షులు సంకురుభుక్త జోగారావు, సీనియర్ నాయకులు గండిబోయిన పోలిరాజు, తగరపువలస డివిజన్ అధ్యక్షులు తమ్మిన సూరిబాబు, పద్మనాభం మండల అధ్యక్షులు కాళ్ళ నగేష్ కుమార్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ శివాజీ, సీనియర్ నాయకులు మారోజు సత్యవరప్రసాద్, కాసరపు నాగరాజు, గండిబోయిన పోలిరాజు, సంకురుభుక్త జోగారావు, కాసరపు ఎల్లాజి, కొక్కిరి అప్పన్న, వియ్యపు పోతురాజు, నమ్మి శ్రీరామ్, కొక్కిరి నూకరాజు, కొక్కిరి అప్పన్న, కదిరి ఎల్లయ్య, సత్తరపు శివ, శంకర్ రెడ్డి, నొల్లి చిన రమణ, సత్తరపు చిన్న, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛసర్వేక్షణ్ 2021 పై సమీక్ష నిర్వహించిన జివిఎంసి కమిషనర్



విశాఖపట్నం : స్వచ్ఛ సర్వేక్షణ్ 2021లో ఉన్నత మైన ర్యాంకును సాధించేందుకు గాను సంబంధిత అధికార సిబ్బంది తీసుకుంటున్న చర్యలను కమిషనర్ డా. జి. సృజన వి.ఎం.ఆర్.డి.ఎ చిల్డ్రన్ ఎరేనా థియేటర్ నందు సమీక్షా సమావేశం చేపట్టారు. ఈ సమావేశంలో ఆమె, మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ సూచికలకు అనుగుణంగా వివిధ జోనల్ స్థాయిలో ఏ విధంగా పనులు జరుగుతున్నాయో మదించి రేపటిలోగా జోనల్ వారీగా నివేదిక ఇవ్వాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. జాతీయ స్థాయి అధికారులు స్వచ్ఛ సర్వేక్షణ్ డాక్యుమెంటేషన్ లో ప్రతిపాదించిన విధంగా క్షేత్ర స్థాయిలో డిశంబర్, జనవరి నెలల్లో ఆకస్మికంగా ప్రత్యక్ష పరిశీలనా చేపడతారని అందుకు అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. ఓ.డి.ఎఫ్. పరిశీలనకు గాని, డబ్ల్యు ం పరిశీలనకు గాని, స్వచ్ఛ సర్వేక్షణ్ పరిశీలనకు గాని, విడివిడిగా బృందాలు వచ్చి ప్రత్యక్ష పరిశీలన చేపడతాయన్నారు. స్వచ్ఛత యాప్ వినియోగంపై, వాటిలో అడిగిన అడిగే 7 ప్రశ్నలకుగాను జవాబులు ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని శానిటరీ ఇన్ స్పెక్టర్లకు మరియు వార్డు శానిటరీ కార్యదర్శులకు సూచించారు. చెత్తను ఎక్కువగా వేసే ప్రాంతాలపై(జి.వి.పి.) దృష్టి సారించాలని వాటిని ప్రత్యేక ఆకర్షణ కలిగిన ప్రాంతాలుగా తీర్చిదిద్ది, చెత్తను పారవేయకుండా నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. ప్రజా మరియు సామాజిక మరుగుదొడ్ల మరమ్మత్తులను త్వరితగతిన చేపట్టాలని, కాలువలలో చెత్తను నిలువరించే స్కాన్నర్ గ్రిల్స్ లను ఏర్పాటు చేయాలని ఇంజినీరింగు అధికారులను ఆదేశించారు. ఎం.ఎస్.ఎఫ్. నందు మరియు ఎస్.టి.పి.ల వద్ద నిర్వహించే పనులకు లాగ్ బుక్కులు తయారు చేయించి తనిఖీలకు సిద్ధంగా ఉంచాలని కార్యనిర్వాహక ఇంజినీరు(మెకానికల్)ను ఆదేశించారు. బహిరంగ మలమూత్ర విసర్జన చేసిన వారి పైన, కాలువలో చెత్త వేసే ప్రజలుపైన, వ్యాపారస్తులపైన తగు చర్యలు తీసుకొని వారి నుండి అపరాధ రుసుములు వసూలు చేయాలని ఆదేశించారు. నిషేదిత ప్లాస్టిక్ సామగ్రిని అమ్మే వర్తకులపైన, ప్లాస్టిక్ బ్యాగుల వినియోగాదారుల వద్ద నుండి అపరాధ రుసుం వసూలు చేయాలని సూచించారు. వార్డులలో ఇంటి వద్ద నుండి నేరుగా చెత్తను సేకరణ చేయడానికి ఏర్పాటు చేసిన ప్రైవేట్ వాహనాలను ఎక్కడైతే ఉన్నాయో ఆ ప్రాంతాలలో మాత్రమే ఆరుబయటగల డస్ట్ బిన్ లు తొలగించాలని ఏ.ఎం.ఓ.హెచ్. లను, శానిటరీ ఇన్ స్పెక్టర్లను ఆదేశించారు. ఈ విధుల నిర్వహణలో అంతరాయం ఏర్పడ కుండా వార్డు స్థాయిలో కొంతమంది పారిశుధ్య సిబ్బందిని, మినీ వాహనాన్ని రిజర్వ్ లో ఉంచాలని సూచించారు. ఇంకా ఈ సమావేశంలో అదనపు కమిషనర్ డా. వి. సన్యాసిరావు స్వచ్ఛ సర్వేక్షణ్ 2021పై పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా అందరికీ అవగాహన కల్పించారు. నీటి సరఫరా విభాగపు పర్యవేక్షక ఇంజినీరు వేణుగోపాల్ రావు మాట్లాడుతూ డబ్ల్యు ం మార్కులు పూర్తిగా సాధించడానికి గాను, అందులోని అంశాలైన యు.జి.డి. కనక్షనులను ఏర్పాటు, సెప్టింకు ట్యాంకు క్లీనింగ్ విషయాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సంబందిత జోనల్ కమిషనర్లు వారి యొక్క జోనల్ స్థాయిలో చేపడుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్ పనులపై పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు.



ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డా. వి. సన్యాసి రావు, చీఫ్ మెడికల్ ఆఫీసరు డా. కె.ఎస్.ఎల్.జి. శాస్త్రీ, పర్యవేక్షక ఇంజినీరు వేణుగోపాల రావు అందరు జోనల్ కమిషనర్లు, మెకానికల్ మరియ వాటర్ సప్లై ఇంజినీరింగ్ అధికారులు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్ స్పెక్టర్లు, వార్డు శానిటరీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గా నియామకమైన ఆచార్య పివిజీడి ప్రసాద్ రెడ్డి ని మంగళవారం ఉదయం గౌరవప్రదంగా కలిసి అభినందనలు తెలిపిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి దంపతులు

# సమాజంలో అపోహలు రూపుమాపి, అవగాహన పెంచాలి



ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి

ఆంధ్రవిశ్వవిద్యాలయం : సమాజంలో ఎయిడ్స్ వ్యాధిపై ఉన్న అపోహలను రూపుమాని, అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం ఏయూ సెంటర్ ఫర్ స్టడీస్ ఆన్ సోషల్ ఎక్స్‌క్లూజన్ ఇంక్లూజివ్ పాలసీ (సిఎస్ఎస్ఇఐపి) నిర్వహించిన సోషల్ ఇంక్లూజన్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పెర్సన్స్ విత్ డిజేబులిటీస్ వెబినార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి గ్రస్థులను వేరుచేయడం, వారి పట్ల వివక్ష భావన కనబరచడం సరికాదన్నారు. వారికి అవసరమైన మానసిక స్థైర్యాన్ని అందించడం ఎంతో అవసరమన్నారు. బాధితులకు ఆర్ధిక, సామాజిక, సాంఘిక బలాన్ని అందించడం అవసరమన్నారు. కేంద్రం సంచాలకులు డాక్టర్ పి.సుబ్బారావు సదస్సు ఉద్దేశాన్ని వివరించారు. హెచ్ఐవి, ఎయిడ్స్ మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు.

ప్రభుత్వ ఛాతీ వ్యాధుల ఆసుపత్రి ఏఆర్‌టి సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.చంద్ర రెడ్డి, సిక్కిం కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు కె.ఆర్ రామ మోహన్ తదితరులు ప్రసంగించారు.

## ఏపీ డెంటల్ అసోసియేషన్ వినతిని

# సీఎం జగన్మోహనరెడ్డి దృష్టికి తీసుకువెళ్తా

## రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని



ఆంధ్రప్రదేశ్ డెంటల్ అసోసియేషన్ నాయకులతో మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)

గుడివాడ : ఏపీ డెంటల్ అసోసియేషన్ వినతిని సీఎం జగన్మో హనరెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగ దారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చెప్పారు. మంగళవారం స్థానిక రాజేంద్రనగర్లోని ఇంటి దగ్గర మంత్రి కొడాలి నానిని ఆంధ్రప్రదేశ్ డెంటల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి డాక్టర్ సీహెచ్ లక్ష్మణ్, కోఆర్డినేటర్ డాక్టర్ నిఖిల్ తేజరెడ్డి, సభ్యురాలు డాక్టర్ అంజలి తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ ఏపీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్లు నేరుగా డెంటిస్టులను ఆరు నెలల కాలానికి కాంట్రాక్ట్ పద్ధతిన విధుల్లోకి తీసుకున్నారన్నారు. వీరంతా కోవిడ్-19 రోగులకు ఐసీయు, ఎమర్జెన్సీ, జనరల్ వార్డులతో పాటు స్వాబ్ కలెక్షన్, సంజీవని విధులను నిర్వర్తిస్తున్నారన్నారు. గత నాలుగు నెలలుగా ప్రతిరోజూ 6 నుండి 12గంటల పాటు ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందిస్తూ వస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా ప్రతిపక్ష నేతగా జగన్మోహనరెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రలో పీహెచ్‌సీలు, 104 సర్వీస్‌ల్లో డెంటిస్టులను నియమిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం వైద్యరంగాన్ని బలోపేతం చేస్తూ వస్తోందని, దీనిలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో డెంటిస్టులను నియమించాలని కోరారు. ఈ నియామకాల్లో కరోనా విధులు నిర్వర్తిస్తున్న డెంటిస్టులకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ళ నానితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులను కూడా కలిసి వినతిపత్రాలను అందజేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ వైద్యసేవలందించేందుకు డెంటిస్టులు సిద్ధంగా ఉన్నారన్నారు. పీహెచ్‌సీలు, 104 సర్వీస్‌లు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల్లో డెంటిస్టులను నియమించడం వల్ల పేదలకు సత్వర వైద్యసేవలు అందుతాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం ఉండదని వారు తెలిపారు. అనంతరం మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని, డెంటిస్టుల సమస్యలను కూడా సీఎం జగన్మోహనరెడ్డికి వివరిస్తానని తెలిపారు.

# త్వరితగతిన వీఎంఆర్డీఏ చేపట్టిన ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి

- ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు అవగాహనా కల్పించాలి !!
- మెట్రోపాలిటన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు ఐఏఎస్., వీఎంఆర్డీఏ

వి.ఎం.ఆర్.డి.ఎ : మంగళవారం వీఎంఆర్డీఏ కార్యాలయంలో సంబంధిత ఇంజనీరింగ్ విభాగ అధికారులతో ఇంటిగ్రేటెడ్ సీ హారియర్ ప్రాజెక్ట్, ప్లానిటోరియం ప్రాజెక్టు, రహదారి నిర్మాణ పనులు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు, నేషనల్ హిస్టరీ అండ్ మ్యూజియం పార్క్ పనులు , ఎన్ఏడి పై వంతెన నిర్మాణ పనుల పురోగతిపై మరియు కైలాసగిరి హిల్ పార్క్ అభివృద్ధి పనులపై సమీక్షించిన మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీ పి కోటేశ్వరరావు ఐ.ఏ.ఎస్.,. అనంతరం LRS పై ప్లానింగ్ విభాగ అధికారులతో సమీక్షించారు.


ఇంటిగ్రేటెడ్ సీ హారియర్ డిజైన్స్ విషయమై ఆర్కిటెక్ట్ శ్రీనివాస్ మూర్తి తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంజనీరింగ్ విభాగ అధికారులతో కలసి సమీక్షించారు. సిరిపురం జంక్షన్ నందు చేపట్టబోయే మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ప్రాజెక్టు విషయమై ఏపీ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రతినిధులతో చర్చించి ఈ ప్రాజెక్టు శతశాతం పూర్తి వాస్తుకు లోబడి భవిష్యత్ అవసరాలకు తగ్గటుగా డిజైన్లను తీర్చిదిద్దాలని కోరారు.నిర్మాణానికై ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని కోరారు. భవిష్యత్తులో కైలాసగిరి విశాఖలోనే కాకుండా రాష్ట్రంలోనే ప్రముఖ ప్రఖ్యాత పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకునే అవకాశాలు ఉన్నాయని, అందులో ప్లానెటోరియం అత్యంత ఆధునిక టెక్నాలజీతో తీర్చిదిద్దబడతుందని, కనుక బృహత్తర ప్రణాళిక తయారికై తగు చర్యలు తక్షణమే తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దానికనుగుణంగా మౌలిక వసతుల కల్పన చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ-బోనంగి రహదారి నిర్మాణ పనులు, వియంఆర్డిఏ పార్క్ లోని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రాం-నగర్ లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పనులు జనవరి నెలాఖరు లోపు పూర్తి చేసి ఆక్షన్ ప్రక్రియకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. విశాఖ వ్యాలీ దగ్గర 100 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి అవుతున్నాయని, డివైడర్ పనులు మరియు లైటింగ్ కొరకు టెండర్లు పిలవడం జరిగిందని తెలియజేశారు.ప్లానింగ్ విభాగ అధికారులతో ఎల్.ఆర్.ఎస (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ -2020) పై అవగాహన సదస్సులు ఏర్పాటు విధివిధానాలపై చీఫ్ అర్బన్ ప్లానర్ ని అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ నెలాఖరు లోపు ఈ పథకం గడువు పూర్తి కావస్తున్న తరుణంలో ప్రజలకు ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు ఎఫ్. ఎమ్ తదితర మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలని, తరచూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో చీఫ్ ఇంజనీర్ కే రామ్ మోహన్, చీఫ్ అర్బన్ ప్లానర్ సురేష్ కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్లు బాలరామ్ రాజు , సోమశేఖర్ , భవాని శంకర్,ఉమా శంకర్, మరియు ప్లానింగ్ విభాగ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు

## - వృద్ధులకు చీరలు పంపిణీ చేసిన సనపల వరప్రసాద్



మాధవధార : తెలుగుదేశం పార్టీ నాయకులు, విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసన సభ్యులు, మాజీ మంత్రి గంటా శ్రీనివాస్ రావు జన్మదిన వేడుకలు స్థానిక ఉత్తర నియోజకవర్గం పరిధిలో 50వ వార్డు మాధవధారలో వార్డు తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి సనపల.వరప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వరప్రసాద్ నివాసం వద్ద తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణి చేసారు. వార్డులో గల మహిళలకు వరప్రసాద్ అతని సొంత నిధులతో చీరలు పంపిణి చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో మంత్రిగా పార్టీకి,విశాఖ జిల్లాకు గంటా శ్రీనివాస్ రావు ఎనలేని సేవలందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు సనపల.రామచంద్రరావు, పప్పల.గౌరి, కంచరాన.వరదరాజు, అజయ్,నాగన్న, సనపల సత్యనారాయణ,పెంటకోట.శ్రీను,రాజు, పప్పల గోపాల్, చౌద తదితరులు పాల్గొన్నారు.



వైయస్సార్ క్రికెట్ కప్ పబ్లిసిటీ బ్రౌజరును ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో 48వ వార్డు వైకాపా సీనియర్ నాయకుడు నీలి రవికి అందజేస్తున్న 14వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి కటారి అనిల్‌కుమార్ రాజు

# పేద చిన్నారులకు సచిన్ సాయం

ముంబై: సచిన్ టెండూల్కర్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. తీవ్రమైన జబ్బులతో బాధపడే 100 మంది పేద చిన్నారులకు ఆర్థిక సహాయాన్ని అందించనున్నాడు. మహారాష్ట్ర, బెంగాల్, అసోం, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని చిన్నారుల కోసం సచిన్‌కు చెందిన 'ఏకం' ఫౌండేషన్ ఈ కార్యక్రమం చేపట్టనుంది. ఈ నెలారంభంలో అసోంకు చెందిన ఓ ఆస్పత్రికి పీడియాట్రిక్ పరికరాలను కూడా సచిన్ అందించాడు. దీనిద్వారా ప్రతీ ఏడాది 2వేల మంది చిన్నారులు లబ్ది పొందనున్నారు. మధ్యప్రదేశ్‌లోని గిరిజన తెగల్లోని చిన్నారులకు కూడా పోషకాహారం, విద్యా వసతులను సచిన్ ఫౌండేషన్ అందించింది.

# మరో అరుదైన రికార్డు చేరువలో విరాట్ కోహ్లి

కాన్‌బెర్రా: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి మరో అరుదైన మైలురాయికి చేరువలో ఉన్నాడు. ఆస్ట్రేలియాతో బుధవారం జరగబోయే మూడో వన్డేలోనూ అతడు ఈ రికార్డు అందుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. విరాట్ మరో 23 పరుగులు చేస్తే చాలు.. వన్డేల్లో అత్యంత వేగంగా 12 వేల పరుగుల మైల్‌స్టోన్ అందుకున్న ప్లేయర్‌గా నిలుస్తాడు. ఈ క్రమంలో అతడు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమిస్తాడు. ఒకవేళ కాన్‌బెర్రాలో జరిగే మూడో వన్డేలోనే కోహ్లి ఈ 23 పరుగులు చేస్తే.. తన 251వ వన్డే, 242వ ఇన్నింగ్స్‌లోనే 12 వేల పరుగుల మైలురాయిని అందుకుంటాడు. అదే సచిన్ టెండూల్కర్ ఈ ఘనతను అందుకోవడానికి 309 మ్యాచ్‌లు, 300 ఇన్నింగ్స్ తీసుకున్నాడు.


Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com